https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 | సంచిక : 275 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | శుక్రవారం, జూలై,31, 2026 | పేజీలు : 8 | వెల : రూ.1/-

## రామమందిర ట్రస్ట్ తొలి కార్యదర్శిగా
# ఐఐటీ పూర్వ విద్యార్థి..

**అక్రమాలు ఆగుతాయా అని ప్రతిపక్షాల ప్రశ్న**
**రామమందిర ట్రస్ట్‌కు తొలి కార్యదర్శిగా జగదీశ్ అఫాలే**
**విరాళాల అక్రమాలపై ప్రతిపక్షం ప్రశ్నలు**
**చంపత్‌రాయ్‌పై చర్యలు ఎందుకు**
**తీసుకోవడం లేదని నిలదీత**
**ట్రస్ట్ పునర్వ్యవస్థీకరణ అవసరమన్న కాంగ్రెస్...**



**అయోధ్య,జూలై,30:**
అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు తొలి కార్యదర్శిగా ఐఐటీ బాంబే పూర్వ విద్యార్థి జగదీశ్ అఫాలేను నియమించారు. ఆలయ పరిపాలనతో పాటు ఆర్థిక లావాదేవీల్లోనూ కీలక బాధ్యతలు అప్పగించారు. ఇదే సమయంలో రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలపైప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వం, ట్రస్ట్‌ను ప్రశ్నించాయి. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశాయి. జగదీశ్ అఫాలేను ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలకు సంయుక్త అధికారిగా కూడా నియమించినట్లు సమాచారం. రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.
భవిష్యత్తులో అక్రమాలు జరగకుండా ఈ నియామకం ఎలా ఉపయోగపడుతుందో ట్రస్ట్ వివరించాలని సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి అశుతోష్‌వర్మ కోరారు. చంపత్‌రాయ్‌పై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదన్న ప్రశ్నకు కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ కూడా ట్రస్ట్‌పై విమర్శలు చేశారు. పవిత్ర లక్ష్యంతో ఏర్పాటైన ట్రస్ట్‌లో అవినీతి ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. ట్రస్ట్‌ను పునర్వ్యవస్థీకరించి శంకరాచార్యులు సహా ప్రముఖ సన్యాసుల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. అయోధ్య ప్రజలకు శ్రీరాముడితో చారిత్రక అనుబంధం ఉందని, వారికీ ట్రస్ట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

## ఒక్క రోజులో మూడుసార్లు మార్కులు మారాయి..
# నీట్ స్కోర్‌పై ఢిల్లీ హైకోర్టుకు విద్యార్థి

**ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థి**
**650 నుంచి 500.. చివరకు 135 మార్కులు వచ్చాయని ఆరోపణ**
**ఓఎంఆర్ షీట్‌పై అనుమానాలు వ్యక్తం చేసిన విద్యార్థి**
**అసలు ఓఎంఆర్‌ను భద్రపరచాలని కోర్టుకు విజ్ఞప్తి**
**శుక్రవారం విచారణ జరపనున్న హైకోర్టు...**



**న్యూఢిల్లీ,జూలై,30:**
నీట్ యూజీ–2026 పరీక్ష ఫలితాలపై మరో వివాదం తెరపైకి వచ్చింది. ఒక్క రోజులో తన మార్కులు మూడుసార్లు మారిపోయాయని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. తొలుత 650 మార్కులు చూపించిన ఫలితాలు, తర్వాత 500కు, చివరకు 135కు పడిపోయాయని పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వ్యవహారంలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపించిన విద్యార్థి, తన అసలు ఓఎంఆర్ జవాబు పత్రాన్ని భద్రపరిచి స్వతంత్రంగా పరిశీలించాలని కోర్టును కోరాడు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరగనుంది. న్యాయవాది వినీత్ జిందాల్ ద్వారా దాఖలైన పిటిషన్‌లో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. పరీక్ష రాసిన సమయంలో తాను నింపిన ఓఎంఆర్ షీట్‌కు, ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో చూపించిన ఓఎంఆర్‌కు పొంతన లేదని విద్యార్థి ఆరోపించాడు. అందువల్ల తన అసలు ఓఎంఆర్ జవాబు పత్రంతో పాటు పరీక్షకు సంబంధించిన అన్ని రికార్డులను భద్రపరచాలని, స్వతంత్రంగా పరిశీలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును అభ్యర్థించాడు. పిటిషన్ ప్రకారం.. విద్యార్థి జూన్ 21న నిర్వహించిన నీట్ యూజీ–2026 రీ–ఎగ్జామినేషన్‌కు హాజరయ్యాడు. తాత్కాలిక, తుది ఆన్సర్ కీతో తన సమాధానాలను పోల్చి చూసుకున్న తర్వాత సుమారు 620 మార్కులు వస్తాయని అంచనా వేశాడు.
అయితే జులై16న ఫలితాలు విడుదలైనప్పుడు ఎన్‌టీఏ పోర్టల్‌లో మొదట 650 మార్కులు కనిపించాయని పేర్కొన్నాడు. అనంతరం పోర్టల్ నుంచి లాగౌట్ అయి మళ్లీ లాగిన్ కావడంతో మార్కులు 500కు తగ్గిపోయాయని పిటిషన్‌లో తెలిపాడు. మరుసటి రోజు మళ్లీ చూసేసరికి అవే మార్కులు 135గా కనిపించాయని ఆరోపించాడు.
ఒకేఅభ్యర్థి ఫలితాలు ఇంత తక్కువ సమయంలో మూడుసార్లు మారడం ఎలాసాధ్యమైందని ప్రశ్నించాడు. ఈ పరిణామం పరీక్షల మూల్యాంకన ప్రక్రియపై అనుమానాలు కలిగిస్తోందని పేర్కొన్నాడు.
తనఅసలు ఓఎంఆర్ జవాబు పత్రాన్ని కోర్టు పర్యవేక్షణలో భద్రపరచాలని, స్వతంత్ర నిపుణులతో పరిశీలించే అవకాశం కల్పించాలనివిద్యార్థి కోరాడు. ఈఅంశంపైఎన్‌టీఏ నుంచిపూర్తి వివరాలుతీసుకోవాలని కూడా పిటిషన్‌లో విజ్ఞప్తి చేశాడు. ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు ఏవిధమైన ఆదేశాలు జారీ చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం...



**వందేమాతరం అవమానాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం**
**జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ**
**అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా విధించేలా కఠిన నిబంధనలు**
**ఉభయ సభల ఆమోదంతో రాష్ట్రపతి పరిశీలనకు చేరనున్న బిల్లు..**

**న్యూఢిల్లీ,జూలై,30:**
జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ)బిల్లు,2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభమూజువాణి ఓటుతో ఆమోదించింది. నిన్నఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొ ందింది. 1971నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది.
నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందే మాతరం గానానికిఆటంకం కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.
జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈచట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలోచర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులుఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా, వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది.

## రెండు హెల్త్ సిరప్‌లపై నిషేధం..
# తప్పుదోవ పట్టించే ప్రకటనలే కారణం..!?
## తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన చర్యలు



**ఫోలిన్యూరో సిరప్ తయారీ, అమ్మకాలపై పూర్తి నిషేధం..!**
**న్యూహెర్బ్ ట్రూ విటమిన్ అమ్మకాలు వెంటనే నిలిపివేయాలని ఆదేశం**
**ఉత్పత్తుల పేర్లు, లేబుల్స్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని వెల్లడి**
**వినియోగదారుల ప్రయోజనాల కోసమే ఈ చర్యలని స్పష్టం చేసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ...**

**న్యూఢిల్లీ,జూలై,30:**
వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇచ్చే ఆహార ఉత్పత్తులపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా, నిబంధనలను ఉల్లంఘించిన రెండు ఉత్పత్తులపై గురువారం నిషేధం విధిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. వటవే హెల్త్ కేర్ సంస్థ తయారుచేస్తున్న 'ఫోలిన్యూరో సిరప్–ఫోలినిక్ యాసిడ్ సిరప్' తయారీ,నిల్వ,పంపిణీ, విక్రయాలపై నిషేధం విధించింది. ఈసిరప్ పేరులో 'న్యూరో' అనే పదాన్ని చేర్చడంతో పాటు, ప్యాకింగ్‌పై మెదడు చిత్రాన్ని ముద్రించడం ద్వారా ఇది మెదడు,నరాల పనితీరును మెరుగుపరుస్తుందనే తప్పుడు సంకేతాలను పంపిస్తోందని సంస్థ స్పష్టం చేసింది.
అంతేకాకుండా, ఆహార భద్రతా ప్రమాణాల్లో లేని 'న్యూట్రిషనల్ ఫుడ్ సప్లిమెంట్' కేటగిరీ కింద దీనిని వర్గీకరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈఆదేశాలను బేఖాతరు చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. మరో ఘటనలో, గ్లోబల్ హెల్త్‌ఫిట్ రిటైల్ ఇండియా మార్కెట్ చేస్తున్న 'న్యూహెర్బ్స్ ట్రూ విటమిన్' విక్రయాలను సైతం ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధించింది. 'ట్రూ విటమిన్' అనే వాణిజ్య నామం నిబంధనలకు విరుద్ధంగా ఉందని, ఇది వినియోగదారులను పెడదోవ పట్టించేలా ఉందని స్పష్టం చేసింది. తక్షణమే అమ్మకాలను నిలిపివేయాలని, లేబుల్స్ మరియు ప్రకటనల నుంచి అభ్యంతరకర అంశాలను తొలగించాలని ఆదేశించింది. దీనిపై చేపట్టిన చర్యల నివేదికను 30 రోజుల్లోగా సమర్పించాలని సదరు కంపెనీని ఆదేశించింది. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది.

## భోపాల్ మహిళా అధికారిణి సాహసం...
# కదులుతున్న బస్సును ఆపిన మహిళా ఏసీపీ

**భోపాల్‌లో రైతుల నిరసనలో ఉద్రిక్తత**
**బస్సుకు అడ్డుగా నిలబడి ఆందోళనకారులను నిలువరించిన ఏసీపీ- 'లేడీ సింగం' అంటూ ప్రశంసలు పొందుతున్న మోనికా శుక్లా**




**భోపాల్,జూలై,30:**
మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో రైతుల నిరసన ప్రదర్శనలో భాగంగా, కదులుతున్న బస్సుకు ఎదురుగా నిలబడి ఆందోళనకారులను నిలువరించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) మోనికా శుక్లా ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, నెటిజన్లు ఆమె సాహసాన్ని కొనియాడుతూ లేడీ సింగం'అని అభివర్ణిస్తున్నారు. అయితే, ఆసమయంలో తాను ఏమాత్రం భయపడలేదని, కేవలం తన విధిని మాత్రమే నిర్వర్తించానని ఆమెస్పష్టం చేశారు. నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసం వైపు వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసులు ఒక స్కూల్ బస్సును బ్యారికేడ్‌గా వినియోగించారు. అయితే, ఆందోళనకారులు ఆ బస్సును ముందుకు నెట్టేందుకు ప్రయత్నించగా, అక్కడే ఉన్న ఏసీపీ మోనికా శుక్లా ఏమాత్రం వెనుకాడకుండా ఆ బస్సుకు ఎదురుగా నిలబడి వారిని అడ్డుకున్నారు. ఒక మహిళా అధికారి ప్రదర్శించిన అసాధారణ ధైర్యాన్ని చూసి నిరసనకారులు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈఘటనపై మోనికా శుక్లా స్పందిస్తూ, "ఆందోళనకారులు బస్సును ముందుకు నెట్టడం చూసి, వారిని నిలువరించేందుకు తక్షణమే అడ్డుగా నిలబడ్డాను. నిరసనకారులను నియంత్రించడం నా బాధ్యత, ఆ సమయంలో నాకు ఎలాంటి భయం కలగలేదు. కేవలం నాకర్తవ్యాన్ని మాత్రమే పూర్తిచేశాను" అని వివరించారు.

## 'వందేమాతరం' దేవతల ఆరాధనను
# ప్రతిబింబిస్తుంది: ఒవైసీ

**పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన వందేమాతరం**
**జనగణమన పాడినప్పుడు దేశ వైవిధ్యం కళ్లముందు కదలాడుతుందన్న ఒవైసీ**
**వందేమాతరం ఒక పూజా విధానాన్ని చూపుతుందని వ్యాఖ్య...**



**హైదరాబాద్,జూలై,30:**
పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వందేమాతరం బిల్లు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈకొత్త చట్టంపై ఎంఐఎం అధినేత,హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు వాయిదా పడిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఈ చట్టం దేశ రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'జనగణమన', 'వందేమాతరం'ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మన జాతీయ గీతమైన 'జనగణమన' పాడినప్పుడు భారతదేశ వైవిధ్యం, ఇక్కడి ప్రజల ఐక్యత కళ్లముందు కదలాడుతాయని... అయితే 'వందేమాతరం' మాత్రం ఒక నిర్దిష్ట పూజా విధానాన్ని, దేవతల ఆరాధనను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 1950 నాటి చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ.. నాటితొలి రాష్ట్రపతి డాక్టర్‌రాజేంద్ర ప్రసాద్ ఎలాంటి పార్లమెంటరీ తీర్మానం లేకుండానే వందేమాతరానికి జాతీయ గేయ హోదా ఇవ్వడం సరైన నిర్ణయంకాదని వ్యాఖ్యానించారు. అసలు మన చట్టాల్లో గానీ, రాజ్యాంగంలోగానీ 'జాతీయ గేయం' అనేపదానికి కచ్చితమైన వర్గీకరణ లేదా నిర్వచనమే లేదని ఆయన గుర్తుచేశారు.
ప్రస్తుతం కేంద్రం తెచ్చిన ఈచట్టం రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులపై దాడి చేయడమేనని ఒవైసీ ఆరోపించారు. ముఖ్యంగాఆర్టికల్స్ 25,26,29 కింద లభించే మత స్వేచ్ఛను,సాంస్కృతిక హక్కులను ఈ బిల్లు కాలరాస్తోందని ధ్వజమెత్తారు.

## మంచిర్యాల జిల్లాలో వింత... వర్షంతో పాటు ఆకాశం నుంచి చేపలు!
### మంచిర్యాల జిల్లా చెన్నూరులో భారీ వర్షానికి అరుదైన దృశ్యం

**హైదరాబాద్,జూలై,30:**
మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షం ఓఅరుదైన దృశ్యాన్ని ఆవిష్కరించింది. వర్షపు నీటితో పాటు చిన్న పాటిచేపలు వీధుల్లోకి కొట్టుకురావడంతో స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. రోడ్లపై కనిపిస్తున్న ఆచేపలను పట్టుకోవడానికి పిల్లలు, యువకులు పోటీపడ్డారు. పట్టణంలోని పుప్పాల హనుమాన్ వీధిలో ఈ వింత ఘటన చోటుచేసుకుంది. కుండపోత వర్షం కారణంగా వీధులన్నీ జలమయమయ్యాయి. ఈ క్రమంలో వరద నీటిలో చేపలు కొట్టుకురావడం స్థానికులను విస్మయానికి గురిచేసింది.
కొందరు ఇవి ఆకాశం నుండి పడ్డాయని భావించినప్పటికీ, ఈ చేపలు అసలు ఎక్కడి నుండి వచ్చాయనే అంశంపై స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా ఈ చేపలను పట్టుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి కాస్తా వైరల్ అయ్యాయి. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వానలకు చెరువులు, కుంటలు వంటి జలాశయాలు నిండి పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలోనే సమీపంలోని నీటి వనరుల నుంచి చేపలు వరద నీటితో పాటు జనావాసాల్లోకి కొట్టుకొచ్చి ఉంటాయని భావిస్తున్నారు.

## “డీకే చాటింపు ప్రత్యేక కథనం...”

# పార్కింగ్ పాయింట్ ఏర్పాటుకు ముందే..
# ఈ నిబంధనలు ఎలా..!?

-నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోకి ప్రైవేట్ వాహనాల నిషేధం...! -ప్రయాణికుల నుంచి సర్వత్ర నిరసన... -వాహనాల నియంత్రణకు బస్టాండు ప్రధాన మార్గాల్లో ఆర్టీసీ సెక్యూరిటీ గార్డుల ఏర్పాటు... -బస్సులు బయటకు వెళ్లే మార్గంలో వాహనదారులకు చుక్కలు చూపించిన సెక్యూరిటీ గార్డు... -బస్సులు లోపలికి వెళ్లే మార్గంలో కొంతమేర ద్విచక్ర వాహనాలకు అనుమతించిన గార్డు... -పార్కింగ్ పాయింట్ లేకుండానే జరిమానాలు విధించడం సబబు కాదు... -నారాయణపేట ఆర్టీసీ డిపో అధికారులు పునర్ ఆలోచన చేయాలి...

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోకి ప్రైవేట్ వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించినట్లు డిపో మేనేజర్ బుధవారం ప్రకటించిన నేపథ్యంలో బస్టాండ్ లోపలికి వచ్చే రెండు మార్గాల్లో గురువారం ప్రత్యేకంగా ఆర్టీసీ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. దాంతో ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్లో పార్కింగ్ పాయింట్ ఏర్పాటు చేయకముందే ఈ నిబంధన పెట్టడంపై సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది. ఇద్దరు సెక్యూరిటీ గార్డులలో ఓ గార్డు ఏ ఒక్క ద్విచక్ర వాహనాన్ని బస్టాండ్ ఆవరణలోకి అనుమతించలేదు.మరొక గార్డు కొంత వరకు చూచి చూడనట్లుగా ఉండడంతో ఆ మార్గంలో కొన్ని వాహనాలు బస్టాండ్ లోకి వెళ్ళాయి. పార్కింగ్ ఏర్పాటు చేయక ముందే ఈ నిబంధన అమలుపై ప్రయాణికుల నుంచి నిరసన వ్యక్తం అవుతుంది.ముందుగా పార్కింగ్ పాయింట్ ఏర్పాటు చేసిన తర్వాత ఈ నిబంధన విధించినట్లయితే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ పార్కింగ్ విషయాన్ని పక్కన పెట్టి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం పట్ల సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది.

**ఈనెల 29న చేపట్టిన చర్యలు...**

నారాయణపేట కొత్త ఆర్టీసీ బస్టాండ్లో ప్రయాణికుల భద్రత,ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బస్సుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు బస్టాండ్ ఆవరణలోకి ప్రైవేట్ వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఆర్టీసీ డీఎం ఆర్.రామ్మోహన్,ఏఎంఐ గౌతమ్,ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య తెలిపారు.ఈ మేరకు ఈనెల29న(బుధవారం) ఆర్టీసీ,ట్రాఫిక్ పోలీసు, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నారాయణపేట నూతన బస్టాండ్లో ప్రత్యేక తనిఖీలు(స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు.ఈ తనిఖీల్లో మొత్తం50 ప్రైవేట్ వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోగా, నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘించిన 9 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు.అలాగే 41 వాహనాలకు మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బస్టాండ్లోకి అనుమతి లేని ప్రైవేట్ వాహనాలు ప్రవేశించడం వల్ల బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటం తో పాటు ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు,వృద్ధులు అధిక సంఖ్యలో బస్టాండ్ను వినియోగిస్తున్నందున వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడం,బస్టాండ్లోకి ప్రైవేట్ వాహనాలను తీసుకురావడం,ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.





DK SARADHYAM LOO CHAATIMPU వాయిస్

నిబంధనలు ఉల్లంఘించే వారిపై వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని, ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలను వినియోగించాలని సూచించారు.ప్రయాణికుల భద్రత,ట్రాఫిక్ సౌలభ్యం కోసం చేపడుతున్న ఈ చర్యలకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

**ఈ నెల 30న ఇద్దరు సెక్యూరిటీ గార్డులతో...**

బస్టాండ్ ఆవరణలోకి ప్రైవేట్ వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించిన నేపథ్యంలో గురువారం స్థానిక డిపో మేనేజర్ బస్టాండ్ లోకి వచ్చే రెండు ప్రధాన ద్వారాలు దగ్గర ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈ గార్డులు విధులు నిర్వహిస్తారు. ఈ నిబంధనల అములు నేపథ్యంలో రెండవ రోజు(గురువారం)పలు ద్విచక్ర వాహనాలు నేరుగా బస్టాండ్ లోకి వచ్చాయి. బస్సులు బయటకు వెళ్లే మార్గంలో ఉన్న సెక్యూరిటీ గార్డు ఏ యొక్క వాహనాన్ని బస్టాండ్లోకి అనుమతించడం లేదు.బస్సులు లోపలికి వెళ్లే మార్గంలో ఉన్న సెక్యూరిటీ గార్డు మాత్రం బస్టాండ్ లోకి వచ్చే ద్విచక్ర వాహనాలను పూర్తిగా నియంత్రించలేకపోయారు. దాంతో పలువురు ద్విచక్ర వాహనదా రులు ఆ మార్గం గుండా బస్టాండ్లోకి స్వేచ్ఛగా వచ్చారు.పలువురు మక్తల్ పాయింట్ బస్సు వెంబడి తమ వాహనాలను నిలుపుకొని ఉండగా.. మరికొందరు హైదరాబాద్ వెళ్లే పాయింట్ దగ్గర బైకులను నిలుపుకొని ఉన్న దృశ్యాలు కానవచ్చాయి. మధ్యాహ్నం 11:30గం టల నుంచి గంటపాటు డీకే చాటింపు ప్రతినిధి అక్కడ ఉన్న సమయంలో ఈ దృశ్యాలు అగుపించాయి. ఆర్టీసీ రక్షణ సెక్యూ రిటీ గార్డుల(కాపలాదారు లు) ను ప్రవేశ ద్వారాలు వద్ద ఏర్పాటు చేసిన పూర్తి స్థాయిలో ఫలితం లేక పోయింది.బస్సులు లోపలికి వెళ్లే మార్గంలోనే ఎక్కువగా ద్విచక్ర వాహనాల దారులు బస్టాండ్లో కి స్వేచ్ఛగా రాకపోకలు సాగించారు. బస్సులు బయటికి వెళ్లే మార్గంలో ఉన్న సెక్యూరిటీ గార్డు ఏ ద్విచక్ర దారుని లోపలికి అనుమతించలేదు. దాంతో చాలామంది తమ వాహనాలను తిరిగి వెనకకు తిప్పుకొని ముందుకు వెళ్లిపోవడం..కొందరు ఆ సెక్యూరిటీ గార్డు దగ్గర వాదోపవాదాలు చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర వాహనాలను బస్టాండ్ లోకి ఆయన అనుమతించలేదు. దాంతో ఆ మార్గం గుండా ద్విచక్ర వాహనాలు బస్టాండ్ లోకి వెళ్లి లేకపోయాయి.కానీ బస్సులు లోపలికి వచ్చే మార్గంలో ఉన్న గార్డు మాత్రం కొంతమేరకు సడలింపు ఇవ్వడంతో పలువురు తమ ద్విచక్ర వాహనాలను బస్టాండ్లోకి నేరుగా తీసుకెళ్లారు.బస్టాండ్ లోకి వచ్చేపోయే ప్రయాణికులతో పాటు పలు ద్విచక్ర వాహనాలు ఆర్టీసీ బస్టాండ్ లో రాకపోకలు సాగించాయి.





# వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారమే
# డ్రగ్స్ రహిత జిల్లాను నిర్మిద్దాం..!

-తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పీవీ.పద్మజ,జిల్లా కలెక్టర్ ప్రియాంక,జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్... -చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం.. -బంగారు భవిష్యత్తు కోసం యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలి... -ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్గా మారాలి... -తెలంగాణ ఈగల్ ఫోర్స్, నారాయణపేట జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం...







నారాయణపేట,(డీకే చాటింపు): డ్రగ్స్,గంజాయి వంటి మాదకద్రవ్యా ల నుంచి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతిఒక్కరి బాధ్యత అని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యాంటీ డ్రగ్ సోల్జర్స్గా ముందుకు రావాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.వి.పద్మజ, జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక,ఎస్పీ డాక్టర్ వినీత్ పిలుపునిచ్చారు.తెలంగాణ ఈగల్ ఫోర్స్,నారాయణపేట జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్లో డ్రగ్స్ వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు,లెక్చరర్లు, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.వి. పద్మజ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తూ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.యువత తమ జీవిత లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. స్నేహితులు లేదా పరిచయస్తుల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిసినా,విక్రయిస్తున్నట్లు గమనించినా వెంటనే1908 టోల్ ఫ్రీ నంబర్కు లేదా సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగం లేదా విక్రయం జరిగినట్లు గుర్తిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఒక్కసారి తీసుకుంటే ఎవరికీ తెలియదనే భావన తప్పు**

జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ మాదకద్రవ్యాల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు.”ఒక్కసారి తీసుకుంటే ఎవరికీ తెలియదు”అనే భావన పూర్తిగా తప్పని స్పష్టం చేశారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,ప్రజల సహకారంతో పోలీసు శాఖ అక్రమ మాదకద్రవ్యాల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతోందన్నారు. డ్రగ్స్కు ప్రోత్సహించే వారు నిజమైన స్నేహితులు కాదని, చెడు అలవాట్లకు”లేదు”అని చెప్పగలిగే ధైర్యమే నిజమైన వ్యక్తిత్వమని అన్నారు.



**పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ రాష్ట్ర ఈగల్ ఫోర్స్ బృందం డ్రగ్స్ నిర్మూలన కోసం నిరంతరం ప్రత్యేక దాడులు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు,ముఖ్యంగా యువత, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.డ్రగ్స్కు అలవాటు పడిన యువత వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటారని,దేశ అభివృద్ధిపైనా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్గా మారి సమాజంలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.అనంతరం నారాయణపేట మండలం అప్పక్ పల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్(రీహాబీటేషన్)ను ఈగల్ ఫోర్స్ ఎస్పీ పీ.వి పద్మజ,కలెక్టర్ ప్రియాంక,ఎస్పీ డాక్టర్ వినీత్ లు పరిశీలించి డ్రగ్స్ అడిక్షన్ కు గురైన యువకులతో మాట్లాడి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.అనంతరం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఈగల్ ఫోర్స్ ఎస్పీ పద్మజ గారు జిల్లాలో డ్రగ్స్,గంజాయి అంశంపై రివ్యూ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య,తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఉమ్మడి మహబూబ్నగర్ ఇన్చార్జి డీఎస్పీ బుచ్చయ్య, డీఎంహెచ్వో జయచంద్ర మోహన్,సీఐలు శివశంకర్, రామ్‌లాల్,సైదులు,భగవంత్ రెడ్డి,ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు,లెక్చరర్లు, సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## భద్రకాళి,వడ్డేపల్లి బండ్ లపై కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన బల్దియా కమిషనర్ టి.వెంకన్న



కొప్పుల రాజేందర్ డీకే చాటింపు హనుమకొండ భద్రకాళి బండ్ పై పెండింగ్ పనులను పూర్తి చేసేలా చూడాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను గురువారం ఆదేశించారు.నగర పరిధి లోని భద్రకాళి,వడ్డేపల్లి బండ్ లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పూర్తి చేసిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా భద్రకాళి బండ్ పై పూర్తి చేసిన పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు పక్షం రోజులో బండ్ పై మిగిలిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం వడ్డేపల్లి బండ్ ను సందర్శించిన కమిషనర్ బండ్ పై కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని ఆగస్టు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి బండ్ పై హార్టికల్చర్ కు సంబంధించి గ్రీనరీఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అందుకోసం అంచనాలు తయారు చేయాలని అన్నారు. వడ్డేపల్లి బండ్ పైన గ్రీనరీ ఏర్పాటుకుటెండర్ ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులను ప్రారంభించాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు.ఈ పర్యటన లో కమిషనర్ వెంట పర్యవేక్షక ఇంజనీర్ రాజ్ కుమార్,హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి,డి.ఈ రాజ్ కుమార్,ఏఈ హరికుమార్ తదితరులు ఉన్నారు.

## భగత్ సింగ్ నగర్ లో సుడిగాలి పర్యటన చేసినజెడ్ సి వికాస్

మహేశ్వరం, జూలై 30 (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం డాక్టర్స్ కాలనీ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో గవర్నమెంట్ స్కూల్,కమ్యూనిటీ హాల్,మినీ ఫంక్షనల్ షెడ్,నవజ్యోతి మహిళా భవన్,ఓపెన్ జిమ్ ల గురించి సుడిగాలి పర్యటన చేసిన అధికారులు జెడ్ సి వికాస్ , డిసి శ్రీకాంత్ , ఏఈ విజయ్ , ఈఈ కార్తీక్ . ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ ,జనరల్ సెక్రటరీ ఇమ్రాన్ అలీ , జనార్ధన్ గౌడ్ , ఆసిఫ్ , పాషా తదితరులు పాల్గొన్నారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శుక్రవారం, జూలై,31, 2026

# కాలేయ వ్యాధి పట్ల అవగాహన అవసరం...

కాలేయం మెదడు తరువాత శరీరంలో రెండో అతిపెద్ద, రెండో అత్యంత క్లిష్టమైన అవయవం. కాలేయం జీవక్రియలను, జీర్ణవ్యవస్థను నియంత్రించుటలో, శరీరంలోని వ్యర్థపదార్థాలను తొలగించుటలో ఎంతగానో సహాయం చేస్తుంది. రోగ నిరోధక శక్తి, జీర్ణక్రియ, జీవక్రియ, గ్రహించిన పోషకాల నిల్వ, విసర్జనకు సంబంధించిన కీలకమైన విధులను నిర్వహించడానికి ఇది బాధ్యత వహిస్తుంది. ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం (హెపటైటిస్) ప్రతి ఏటా జూలై 28న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వైరల్ హెపటైటిస్ గురించి అవగాహన పెంచడం, హెపటైటిస్ నిర్మూలించేలా ప్రపంచం నలుమూలల ఉన్న ప్రజలను ప్రోత్సహించడం, అలాగే హెపటైటిస్ తో బాధపడుతున్న లక్షలాది మందిని గుర్తించే లక్ష్యంతో ఈ రోజును ఏర్పాటు చేశారు. హెపటైటిస్-బి వైరస్ ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రవేత్త బారుచ్ శామ్యుల్ బ్లూమ్‌బర్గ్ గౌరవార్థం ఆయన పుట్టినరోజు (జూలై 28) నాడు జరుప బడుతుంది. ప్రతి సంవత్సరం 100కి పైగా దేశాలలో ప్రదర్శనలు, ప్రచారాలు, కచేరీలు, టాక్ షోలు, ఫ్లాష్ మాబ్స్, టీకా డ్రైవ్‌లు వంటి కార్యక్రమాలు నిర్వహించ బడుతాయి. 2004, అక్టోబరు 1న యూరోపియన్, మిడిల్ ఈస్టర్న్ పేషెంట్ గ్రూప్స్, బేబీ మురియెల్ సమన్వయంతో అంతర్జాతీయ హెపటైటిస్ సి అవగాహన దినోత్సవం జరిగింది. వేరువేరు సమూహాలు వేర్వేరు తేదీలలో ఈ దినోత్సవాన్ని జరుపుకున్నాయి. ఈ కారణంగా 2008లో వివిధ ప్రాంతాలలోని రోగుల సమూహాల సహకారంతో ప్రపంచ హెపటైటిస్ అలయన్స్ సంస్థ మే 19ను మొదటి ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవంగా ప్రకటించింది. కాలేయ వ్యాధి దినోత్సవం నిర్వహించాలన్న ఆలోచన కటక్ లో వచ్చింది. హెపటైటిస్-బి వైరస్ ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రవేత్త బారుచ్ శామ్యుల్ బ్లూమ్‌బర్గ్ గౌరవార్థం ఆయన పుట్టినరోజైన జూలై 28న ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని కటక్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.పి. సింగ్ ప్రతిపాదించాడు. 2010, మే నెలలో జరిగిన 63వ ప్రపంచ ఆరోగ్య సభలో ఈ ప్రతిపాదన ఆమోదించబడి, జూలై 28న పంచ కాలేయ వ్యాధి దినోత్సవంగా ప్రకటించ బడింది. కాలేయ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వందల మిలియన్ల ప్రజలపై ప్రభావితం చూపిస్తుంది. ఈ వ్యాధి తీవ్రత వల్ల దీర్ఘకాలిక వ్యాధికి గురై ప్రతి సంవత్సరం 1.34 మిలియన్ల మంది చనిపోతున్నారు. బాధితుల్లో 12.22 శాతం మంది 30 ఏళ్లలోపు వారుంటే... 40 ఏళ్లలోపు వారు 25.8 శాతం, 50 ఏళ్లలోపు వారు 28.10 శాతం, 60 ఏళ్లలోపు వారు 21.74 శాతం ఉండడం గమనార్హం. సాధారణంగా మద్యం, మాంసం, ఆయిల్ ఫుడ్ అతిగా తీసుకునేవారే ఎక్కువగా కాలేయ జబ్బుల బారిన పడుతుంటారు. ఆశ్చర్యకరమైన అంశమేమిటంటే కనీస/తక్కువ బరువుతో ఉన్నవారు... ఎలాంటి దురలవాట్లు లేనివారు సైతం ప్రస్తుతం ఫ్యాటీ లివర్‌తో బాధ పడుతున్నారు. ఇలా ప్రతి 10 మందిలో ఐదారుగురు ఈ సమస్యతో బాధ పడుతుండడం ఆందోళన కలిగించే అంశం. మద్యపానం, ధూమపానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఊబకాయం మొదలైన వాటితో సహ జన్య లేదా జీవనశైలి కారకాలు కాలేయానికి హాని కలిగిస్తాయి. కాలేయ మార్పిడి తప్పనిసరి అయిన పరిస్థితుల్లో, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అవసరమైన వారికి తమ కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చినా... వయసు, బ్లడ్‌గ్రూప్ మ్యాచింగ్ కావడం లేదు. ఒకవేళ మ్యాచ్ అయినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా లైవ్ డోనర్ సర్జరీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో చికిత్సలు జరగడం లేదు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలలో ఎక్కువ శాతం కృత్రిమ క్రొవ్వులు, కృత్రిమ చక్కెరలు ఉంటాయి, ఇవి ఆరోగ్యనీ పై పెను ప్రభావాన్ని చూపించ గలవు. ఊబకాయం, అస్తవ్యస్త జీవ క్రియలు, జీర్ణాశయ పని తీరు మందగింపు, మూత్రాశయ సంబంధిత సమస్యలు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు హెచ్చు మీరడం, రక్త పోటు, హృదయ సంబంధిత వ్యాధులు మొదలైన వాటికి కారణనీ అవుతుంటాయి. ఉప్పు అధికంగా తీసుకోవడం కాలేయ కణాలకు కూడా అసౌకర్యాన్ని కలిగించి ఫైబ్రోసిస్ కు దారితీస్తుంది. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసిన , నిల్వ ఉంచిన ఆహార పదార్థాల కారణంగా శరీరంలో అధిక క్రొవ్వులు పేర్కొని పోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. మాంసంలో ఉండే అధిక ప్రోటీన్, అధిక క్రొవ్వులు కాలేయానికి తీవ్రమైన ప్రభావాలను ఇస్తుంటాయి.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి:
సెల్ : 9603754136 - 7386287837

## గురు పౌర్ణమి సందర్భంగా విశ్వశాంతి కొరకు

# మహా గాయత్రి యజ్ఞము

- అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొందుకూరి శ్రీనివాస్ చారి







జగిత్యాల, జులై30, డీకే చాటింపు:
గురు పౌర్ణమి సందర్భంగా విశ్వశాంతి నీ కాంక్షిస్తూ మహా గాయత్రి యజ్ఞము ఆషాడ మాస గురు పౌర్ణమి సందర్భంగా జగిత్యాల లోని గాయత్రి జ్ఞాన మందిరంలో గాయత్రి యజ్ఞము మృత్యుంజయ హోమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ది అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొందుకూరి శ్రీనివాస్ చారి పాల్గొని గురువులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కాసం అశోక్ కనపర్తి నాగభూషణం చారి హోమం యజ్ఞ కార్యకర్తలు కనికరపు లచ్చన్న కొమరవెల్లి లక్ష్మి హోమంలో నాగభూషణం దంపతులు అశోక్ దంపతులు ఇల్లెందుల పురుషోత్తం దంపతులు దుర్శెట్టి కిరణ్ కుమార్ దంపతులు తదుపరి అన్నప్రసారం నిర్వహించారు. భాస్కర్ దంపతులు శంకర్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అధ్యక్షులు కొమురవెల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


# ఆధ్యాత్మికత తోనే మనస్సు ప్రశాంతం: మంత్రి శ్రీధర్ బాబు

## - ప్రతీ వ్యక్తిలోనూ అంతరంగిక శక్తి దాగి ఉంటుంది: కేఎల్ఆర్ -గురు పౌర్ణమి సందర్భంగా అల్మాస్ గూడలో పూజలు-సామిడి గోపాల్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబుని ఘనంగా శాలువాతో సన్మానం

మహేశ్వరం, (డీకే చాటింపు)సమాజం సహా ఇంట్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉన్నప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని రంగారెడ్డి జిల్లా మంత్రివర్యులు, ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం జిహెచ్ఎంసి ప్రశాంతిహిల్స్ డివిజన్ నందిహిల్స్ కాలనీలోని శ్రీ దత్త సిద్ధాంతకర్త గోపాలకృష్ణానంద స్వామీజీ ఇంట్లో జరిగిన గురపౌర్ణమి వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు , మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి , కంటెస్టేట్ ఎమ్మెల్యే ఏలిమేటి అమరేందర్ రెడ్డి , డివిజన్ నాయకులు సామిడి గోపాల్ రెడ్డి గారు సహా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గం సహా ప్రతీ ఒక్కరినీ దీవించాలని... అందరూ బాగుండాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం మీర్ పేట, ప్రశాంతి హిల్స్ డివిజన్ల కాంగ్రెస్ నాయకులు సామిడి గోపాల్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబుని ఘనంగా శాలువాతో సన్మానించారు.



# మద్ది కర్ణాకర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కర్మన్‌ఘాట్ లో ప్రత్యేక పూజలు



హైదరాబాద్, జూలై 30 (డీకే చాటింపు) : తుమ్మలూరు మాజీ సర్పంచ్, రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మన్ మద్ది కర్ణాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఈరోజు కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యాన ఆంజనేయ స్వామి దేవాలయంలోలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్ అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కర్ణాకర్ రెడ్డి గారు త్వరగా కోలుకొని తిరిగి ప్రజా జీవితంలో అడుగు పెట్టాలని భక్తులు, స్నేహితులు స్వామి వారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా కర్ణాకర్ రెడ్డి ని హాస్పిటల్ లో చేర్పించి, ఎప్పటికప్పుడు చికిత్స అందేలా చూస్తున్న లిచేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి కి స్నేహితులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గోపాల్ ముదిరాజ్, బత్తుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కర్ణాకర్ రెడ్డి గ ఎల్లప్పుడూ ప్రజాసేవకే అంకితమైన నాయకుడు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి. ఆయన త్వరగా కోలుకోవాలి. కష్ట సమయంలో ఒక పెద్దన్నలా ఆదుకుని, ప్రత్యేక శ్రద్ధతో ట్రీట్మెంట్ చేయిస్తున్న రంజిత్ రెడ్డి కి మేము జీవితాంతం రుణపడి ఉంటాము అని అన్నారు. పాల్గొన్నవారు: మాధవ్ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, బత్తుల శ్రీనివాస్ రెడ్డి, పల్లెల నరసింహారెడ్డి, ఎం. భాష, గోగు శేఖర్ రెడ్డి, రాజేష్ యాదవ్, వెంకట్ చారి, వెంకటేష్, భాస్కర్ రావు, కొండ యాదగిరి, ఉయ్యాల యాదయ్య గౌడ్, రామకృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సదానందం, సీతారాం రెడ్డి తదితర స్నేహితులు, భక్తులు పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్‌లో విజయవంతంగా ముగిసిన

# 24 గంటల సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమం



ఎల్బీనగర్, జూలై 30 (డీకే చాటింపు) రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు హస్తినాపురం డివిజన్‌లో నిర్వహించిన 24 గంటల ూ×= ప్రవాస్ అభియాన్ కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రవాస్ యోజన ఇన్‌చార్జ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్పాల్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, డివిజన్ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, బి ఎల్ వో -2లు, బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహించారు. సర్ కార్యక్రమం పురోగతిపై సమీక్ష చేపట్టి, ఇప్పటివరకు అందిన ఫారమ్‌ల నమోదు, క్షేత్రస్థాయి కార్యాచరణ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పనులపై సమగ్రంగా చర్చించి, ప్రతి బూత్‌లో కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రవాస్ కార్యక్రమంలో భాగంగా శ్రీ యస్పాల్ గౌడ్ గారు డివిజన్ నాయకులతో కలిసి హస్తినాపురం డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీ సి.ఎస్. గణేష్ గారి నివాసాన్ని సందర్శించి, ఎస్సీ మోర్చా సంస్థాగత నిర్మాణం, పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి కార్యాచరణపై చర్చించారు. అనంతరం గణేష్ గారి నివాసంలో కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. రాత్రి సమయంలో శ్రీ యస్పాల్ గౌడ్ , హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ , జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ రాజేంద్ర ప్రసాద్ గారు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీ గజ్జల రాజు గౌడ్ గారు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీ గణేష్ గారితో కలిసి డివిజన్‌లో బస చేసి, కార్యకర్తలతో మమేకమయ్యారు. రెండో రోజు ఉదయం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీ బీరం అమరేందర్ రెడ్డి గారి నివాసంలో ఏర్పాటు చేసిన టిఫిన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బూత్ నంబర్లు 461, 462, 447, 450, 459, 460, 444, 402, 400, 403, 404, 405, 406,487, 364, 365, 366, 451, 452, 453, 454, 455, 456,457, 393, 394, 408లను సందర్శించి, దీూాలు, దీూా-2లు, బూత్ అధ్యక్షులతో సమావేశమై ూ×= కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం డివిజన్ సెక్రటరీ గోవర్ధన్ యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో పాల్గొని, కార్యకర్తలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. పార్టీ బలోపేతం, సర్ కార్యక్రమం విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దిల్‌సుఖ్‌నగర్ భాగ్ సహ కార్యవాహ్ ప్రేమ్ రాజ్ మోటే , స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వివిధ బూత్‌లను సందర్శించి క్షేత్రస్థాయి కార్యక్రమాలను పరిశీలించారు. అలాగే హనుమాన్ నగర్‌లో కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సంబంధిత బి ఎల్ ఓకి వినతిపత్రం అందజేశారు. ఈ 24 గంటల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, బి ఎల్ ఓ లు, బి ఎల్ ఓ -2లు, బీఎల్ఏలు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన నూతన ఓటర్లను నమోదు చేసుకోవాలి

### డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లంకి ధనరాజ్ గౌడ్



మహేశ్వరం, , జూలై 30 (డీకే చాటింపు) (ఎస్ఐఆర్)ప్రక్రియ లో భాగంగా ఓటర్ల సవరణ కార్యక్రమం ద్రాక్ష డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని బస్తీ దవఖాన, తదితర ప్రాంతాలలో డివిజన్ అధ్యక్షులు నల్లంకి ధనరాజ్ గౌడ్ పాల్గొన్నారు. బ, బి ఎల్ ఓ ల తో కలసి ఏన్యూ మరేషన్ ఫారం ఓటర్ నుండి తీసుకోవడం ఓటర్కి ఇవ్వడం జెరిగింది. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రక్షించుకోవడం, అర్హులైన నూతన ఓటర్లను నమోదు చేసుకోవడం, ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పనిసరిగా పరిశీలించుకుని ప్రజాస్వామ్య హక్కును కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి కార్యాచరణను సమీక్షించారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



మహేశ్వరం, జూలై 30 (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ ( జిహెచ్ఎంసి) బాలాపూర్ డివిజన్ మల్లాపూర్ మరియు బడంగ్ పేట్ డివిజన్ ఇందిరానగర్ ప్రాంతాలలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నఎస్ఐఆర్ (సర్) కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, బాలాపూర్ డివిజన్ పరిశీలకులు సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, పార్టీ నాయకులు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ... ఆగస్టు 3వ తేదీతో ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ గడువు ముగియనున్నందున, ఇంకా ఎవరైనా ఎన్యుమరేషన్ ఫారాలను (ఏనుమేరేషన్ ఫార్మ్) తిరిగి ఇవ్వనివారు లేదా నమోదు చేసుకోనివారు వెంటనే అప్రమత్తం కావాలి అని, అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే సంబంధిత బీఎల్‌ఏ ( బి ఎల్ ఎ ) లేదా బీఎల్‌ఓ ( బి ఎల్‌ఓ) లను సంప్రదించి జాగ్రత్తపడాలని కోరారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన ఆయుధమని, దానిని కోల్పోతే మన హక్కును మనమే నిర్లక్ష్యం చేసినట్లు అవుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారంలో తప్పకుండా నమోదు చేసుకోవాలని, బీఎల్‌ఓలకు వాటిని అందజేసి ఆన్‌లైన్ కూడా చేయించుకోవాలని పిలుపునిచ్చారు.

# విశాఖలో రియల్ షాక్

**విశాఖపట్టణం,** : ఉత్తరాంధ్ర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్ట్ ఒక గేమ్ ఛేంజర్‌గా మారిన మాట వాస్తవమే. అయితే, దీనిని ఆసరాగా చేసుకుని విశాఖ నగర శివారైన ఆనందపురం జంక్షన్ నుండి పద్మనాభం, భోగాపురం వెళ్లే కారిడార్లలో భూముల ధరలు ఇప్పుడు ఊగిసలాడుతున్నాయి. విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతుండటంతో ఇన్వెస్టర్లు ఇటువైపు మొగ్గు చూపుతారనే అంచనాలతో రేట్లు విపరీతంగా పెంచేసారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే.. ఆ రేట్లకు, ఇక్కడి వాస్తవ మార్కెట్ డిమాండ్‌కు అస్సలు పొంతన లేకపోవడంతో ధరల్లో భారీ హెచ్చుతగ్గులు కనిపిస్తూ, కొనుగోలుదారులను అయోమయంలో పడేస్తున్నాయి. ఈ ప్రాంతంలో ధరలు స్థిరంగా ఉండకపోవడానికి ప్రధాన కారణం కొందరు బ్రోకర్లు, స్థానిక డెవలపర్లు సృష్టించిన ఊహాజనిత మార్కెట్ మాత్రమే. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చేస్తోంది కాబట్టి రాత్రికి రాత్రే ఇక్కడ భూముల విలువ కోట్లకు చేరుతుందనే కలరింగ్ ఇచ్చి, ల్యాండ్ రేట్లను అమాంతం ఆకాశానికి చేర్చారు. ఎకరం లేదా గజం ధరను వాస్తవ విలువ కంటే మూడు, నాలుగు రెట్లు పెంచి బోర్డులు పెట్టారు. అయితే, ఈ విపరీతమైన హైప్ కారణంగా సామాన్య, మధ్యతరగతి కొనుగోలుదారులు ఈ జోన్ వైపు రావడమే మానేశారు. దీని ఫలితంగా.. ఆనందపురం, పద్మనాభం లోపలి పరిసరాల్లో వెలిసిన కొన్ని వెంచర్లు ఇప్పుడు కస్టమర్లు లేక వెలవెలబోతున్నాయి.

# టూ టైర్ సిటీస్ లో విల్లా కల్చర్

**కాకినాడ,** : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలోఅత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో,కాకినాడ నుంచి అచ్యు తాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులాకొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది.

# గడ్డిఅన్నారం డివిజన్‌లో కృంగిపోయిన మ్యాన్‌హోల్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

**-- హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్, ఎస్ బి డీజీఎంను కలిసిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి..**



ఎల్బీనగర్, జూలై 30 (డి.కే చాటింపు) గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కృంగిపోయిన మ్యాన్‌హోల్స్‌ను తక్షణమే పునరుద్ధరించి, డివిజన్‌లో నెలకొన్న తాగునీరు, మురుగునీటి సంబంధిత వివిధ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు ఈరోజు ఉదయం హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్, ఎస్ బి ) డీజీఎం చంద్రునాయక్‌ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గడ్డిఅన్నారం డివిజన్‌లో పలుచోట్ల మ్యాన్‌హోల్స్ కృంగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థకు సంబంధించిన పెండింగ్ సమస్యలను కూడా అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి డీజీఎం చంద్రు నాయక్ సమస్యలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

# బెల్లంపల్లి రాంనగర్ బ్రిడ్జిని పరిశీలించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

బెల్లంపల్లి (డీకే చాటింపు ) రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, మంచిర్యాల జోన్ బెల్లంపల్లి పట్టణంలోని 27వ,33వ వార్డుల మధ్య ఉన్న రాంనగర్ బ్రిడ్జిపై వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తున్న పరిస్థితిని గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం, భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకల పరిస్థితిని సమీక్షించి, పోలీసు,రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ,భారీ వర్షాల కారణంగా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు,కాలువలు, బ్రిడ్జిలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు,బ్యారికేడ్లను గౌరవిస్తూ పోలీసు, రెవెన్యూ,మున్సిపల్ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే పోలీసులకు లేదా



సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, చిన్నారులను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్,మున్సిపల్ కమిషనర్ రమేష్,, తహసీల్దార్,కృష్ణ,కౌన్సిలర్లు శ్రవణ్, పోలు ఉమాదేవి శ్రీనివాస్, రామ్మూర్తి,వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, రూరల్ సీఐ హనుక్,ఇతర ఎస్ఐలు,పోలీసు సిబ్బంది,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వరుస తప్పులతో ఉదయ్ కృష్ణారెడ్డి

**ఒంగోలు, హైదరాబాద్,** : ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ కాంపిటీటర్లకు ఆదర్శంగా నిలిచి, శ్రమించి సాధించిన విజయాన్ని ఒక క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లాల్సిన ఒక ఐపీఎస్ ట్రైనీ అధికారి.. వ్యక్తిగత ప్రవర్తనా లోపాలు, విలువలేని నిర్ణయాలతో తన చేజేతులా కెరీర్‌ను నాశనం చేసుకున్న ఆశ్చర్యపరుస్తోంది. ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో వెలుగు చూసిన వరుస పరిణామాలు, సహ-ట్రైనీతో వివాదం , ఆ తర్వాత చోటుచేసుకున్న డ్రామాలు ఆయన తీవ్రమైన నైతిక పతనానికి నిదర్శనంగా నిలిచాయి. ఉన్నతమైన స్థానానికి చేరుకున్న తొలి మెట్టులోనే నైతికంగా దృఢంగా నిలబడాల్సింది పోయి, ప్రవర్తనా నియమావళిని విస్మరించడం వల్లనే ఈ పరిణామాలు పీకల మీదకు వచ్చాయి. తోటి వివాహిత ట్రైనీ ఐపీఎస్ అధికారితో ఉన్న వ్యక్తిగత సంబంధం బెడిసికొట్టడం, దానిపై పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కేంతగా విభేదాలు రావడం ఒక ఎత్తయితే.. ఆ తర్వాత ఆయన ప్రదర్శించిన వైఖరి మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత విషయాలను బహిర్గతం చేయడం, లీగల్ నోటీసులకు విరుద్ధంగా వ్యవహరించడం , సింపతీ పొందడానికి ఆత్మహత్యాయత్నం నాటకాలు ఆడటం వంటి చర్యలు సర్వీస్ నిబంధనలకు సంపూర్ణంగా విరుద్ధం. ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పరం మాట్లాడుకుని సర్దుబాటు చేసుకోవాల్సిన లేదా చట్టబద్ధంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యను రోడ్డున పడేసి, రచ్చ చేసుకోవడం ద్వారా ఉదయ్ కృష్ణారెడ్డి తన ప్రొఫెషనలిజాన్ని గాలికి వదిలేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. భారత సివిల్ సర్వీసెస్‌లో పనిచేసే అధికారులకు నైతికత , ఆత్మనిగ్రహం, భావోద్వేగ నియంత్రణ అత్యంత కీలకమైన అంశాలు. బాధ్యతాయుతమైన ఐపీఎస్ అధికారిగా దేశానికి



సేవ చేయాల్సిన వ్యక్తి, ట్రైనింగ్ దశలోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు, నైతిక లోపాలు ఎదుర్కొని కేంద్ర హోంశాఖ ద్వారా సస్పెన్షన్‌కు గురికావడం ఒక రకంగా వ్యవస్థాత్మక వైఫల్యాన్ని కూడా ఎత్తిచూపుతోంది. విజయం నెత్తికెక్కించుకోకుండా, తన లక్ష్యాన్ని, రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలను నిరంతరం గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాల్సిన ఉదయ్ కృష్ణారెడ్డి.. తప్పు మీద తప్పు చేస్తూ తన కెరీర్‌ను రిస్కులో పెట్టుకున్నారుఇప్పుడు ప్రభుత్వం, కేంద్ర హోంశాఖ తీసుకున్న కఠిన చర్యల వల్ల ఆయనకు తన తప్పులను దిద్దుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఐపీఎస్ స్థాయికి ఎదిగినప్పటికీ వ్యక్తిగత జీవితంలో నియంత్రణ, బాధ్యత లోపిస్తే ఎంతటి ఉన్నతమైన కెరీర్ అయినా క్షణాల్లో తుడిచిపెట్టుకుపోతుందనడానికి ఈ సంఘటన ఒక బలమైన హెచ్చరిక. సివిల్ సర్వీసెస్ సాధించాలనుకునే వేలాది మంది యువతకు ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతం ఒక పాఠంగా నిలవనుంది. సామర్థ్యం ఎంత ముఖ్యమో, వృత్తిపరమైన, వ్యక్తిగత నైతికత అంతకంటే ముఖ్యం. విజయం మత్తులో ఉదయ్ దీన్ని మర్చిపోయారు. కోల్పోయారు.

# కూటమికి టిక్కెట్ల సవాల్

**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేకరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం



చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా, ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది. ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి. ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది.

# జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య పరిష్కారానికి కృషి

**-టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**

మహేశ్వరం, జూలై 30( డీకే చాటింపు) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిషాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సీటిలో జర్నలిస్టులకు కేటాయిస్తున్న ఇండ్ల స్థలాలలో మొదటి ప్రాధాన్యత రంగారెడ్డి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు అవకాశాలు కల్పించాలని టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి కోరారు. గురువారం బాలాపూర్ మండలం బడంగ్ పేట్ కేంద్రంలో జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టియుడబ్ల్యూజె (ఐజేయు) బాలాపూర్ మండలం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సీటిలో హైద్రాబాద్ ప్రాంత జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నందున, అదే ప్రాంతంలో ఉన్న రంగారెడ్డి జిల్లాలోని గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్న అర్హులైనవారందరికి కుడా ఇండ్ల స్థలాలను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో కార్పొరేట్ అసుపత్రుల్లో పనిచేసే విధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో సహ టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ కృషి చేస్తున్నారని దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలి పారు, యూనియన్ ద్వారా గతంలో హెల్త్ ఫాలసీ గడువు ముగిసిందని త్వరలోనే యూనియన్ సభ్యులందరికి 5 లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం త్వరలో కల్పించనున్నట్లు హామి ఇచ్చారు. ఆరోగ్యభీమా, జీవిత భీమా గ్రూపులవారిగా చేసుకునేలా ప్రయత్నాలు కోనసాగించాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యలపై టియుడబ్ల్యూజె రాజీలేని పోరాటం చేస్తుందని టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షకార్యదర్శులు సలీంపాషా, మేకల సత్యనారాయణలు అన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలపై తమ సంఘం నిరంతరం పనిచేస్తుందని అందులో భాగంగా అర్హులైన జర్నలిస్టులకు, అక్రిడిటేషన్ కార్డులు. హెల్త్ కార్డులు అందెలా కృషిచేస్తున్నామన్నారు. అనంతరం బాలాపూర్ మండలం నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే



బాలాపూర్ మండలం నూతన కమిటీ కార్యవర్గం అధ్యక్షుడు కె.మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.జయంత్, కోశాధికారి సి.శ్రావణ్ కుమార్ ప్రధాన సలహాదారులు అనంతుల శ్రీనివాస్, సలహాదారులు ఎం. భుజంగారెడ్డి, ఎండి.నిజాముద్దీన్, భూపాల్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్ గౌడ్, ఏం.అమరేశ్వర్ రెడ్డి, ఆర్.రమేష్, సంయుక్త కార్యదర్శులు జి.శ్రీనివాస్, బొల్లంపల్లి రాంబాబు, కే.శ్రావణ్, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, జిల్లాకార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మాజీ జిల్లా అధ్యక్షులు ఆనంతుల శ్రీనివాస్,జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు పాండు యాదవ్,ఎలాక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు నర్సింహా, సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, బొల్లంపల్లి ఆంజనేయులు, సూర్యనారాయణ, ఈసీ సభ్యులు సురేందర్, జంగయ్య, శేఖర్, కృష్ణ, రాజ్ కుమార్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని జర్నలిస్టుల హక్కుల రక్షణకు స్థానిక కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంచాల, యాచారం మండలాల పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులు, వివిధ పత్రికల విలేఖరులు, యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీయూడబ్ల్యూజే బాలాపూర్ మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక-నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు సన్మానించారు. అనంతరం జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల.. పిల్లలే మన ఆస్తి అన్న నారా లోకేశ్

**విజయవాడ:** విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'తల్లికి వందనం' పథకం నిధుల విడుదలయ్యాయి. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.70 లక్షల మంది అర్హులైన తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి విద్యార్థి తల్లికి రూ.13,000 చొప్పున అందుతున్న ఈ నిధుల జమ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.70 లక్షల మంది అర్హులైన తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి విద్యార్థి తల్లికి రూ.13,000 చొప్పున అందుతున్న ఈ నిధుల జమ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ ఆర్థిక సాయాన్ని అందజేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఎటువంటి అవాంతరాలు ఎదురుకావని అన్నారు. పిల్లలే మన అసలైన సంపదని, వారి చదువులే కుటుంబానికి తరగని ఆస్తి అని వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న ఆంక్షలను తొలగించి, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకం ఫలాలను వేర్వేరుగా వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేస్తున్న దాదాపు 67.47 లక్షల మంది విద్యార్థులకు దీనివల్ల ప్రయోజనం కలుగుతోందని వివరిస్తూ, పిల్లల చదువు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి తల్లికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

భారీ మెజారిటీతోనే భారీ అభివృద్ధి

మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేశ్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు



తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.

2019 ఎన్నికల నాటి అనుభవాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "అప్పుడు ఇంటి పట్టాల రెగ్యులరైజేషన్‌పై హామీ ఇవ్వమని అడిగారు. కానీ, పూర్తి అవగాహన లేకుండా హామీ ఇవ్వడం సరికాదని చెప్పడంతో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి నాలో కసి పెంచింది. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా" అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత నిధులతో ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పేదల ఇళ్లలో శుభకార్యాలకు సాయం, అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని వివరించారు.


మోడల్ నియోజకవర్గమే లక్ష్యం

మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

# ఖరీఫ్ ఆశల గల్లంతు

**కర్నూలు** : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఎప్పటి నుంచో వెన్నెముకగా నిలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఐటీ , పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టినా, ఇప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం వ్యవసాయమే. అయితే ఈ ఏడాది ఎల్ నినో ( ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పంటల సాగు ప్రారంభం కావాల్సిన సమయంలోనే వానలు లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌పై అనిశ్చితి నెలకొంది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈసారి ప్రారంభంలో అక్కడక్కడా స్వల్ప వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలన్నర కాలంలో రాష్ట్రానికి రావాల్సిన వర్షపాతం కంటే సుమారు 49 శాతం తక్కువ వర్షం మాత్రమే నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సగటున 170.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 86.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం తీవ్ర కరవుతో అల్లాడుతోంది. జూలై తొలి పదిహేను రోజుల్లో దాదాపు 94 శాతం వరకు వర్షపాతం లోటు నమోదవడం అక్కడి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. అదే సమయంలో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. అక్కడ కూడా సాధారణ స్థాయితో పోలిస్తే దాదాపు 70 శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పకనే చెబుతోంది. రాష్ట్రంలోని 676 మండలాల్లో అధిక శాతం ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతోంది. బోర్లు ఎండిపోవడం, చెరువులు నీరు కోల్పోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం రైతుల్లో మరింత ఆందోళన పెంచుతోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ, పత్తి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఈసారి తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. వర్షాలు లేకపోవడం మాత్రమే కాకుండా, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో విత్తనాలు వేయడానికి కూడా రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సాగు పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవసాయ ఉత్పత్తిపై మాత్రమే కాకుండా గ్రామీణ ఉపాధి, రైతుల ఆదాయం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు త్వరగా మారి జూలై రెండో పక్షంలో అయినా మంచి వర్షాలు కురిస్తే కొంతవరకు పరిస్థితి మెరుగుపడే అవకాశముందని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు. లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి.

# అరటిపండు ఆరోగ్య ప్రయోజనాలు..



అరటి పండు రుచికరమైన పండే కాకుండా శరీరానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, పొటాషియం, ఫైబర్, ప్రోటీన్లు వంటి కీలక పోషకాలతో నిండిన సూపర్ ఫుడ్. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడం, రక్తపోటును నియంత్రించడం, శరీరానికి తక్షణ శక్తిని అందించడం వంటి అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలో ప్రజలు ఇష్టంగా తినే పండ్లలో అరటి పండుకు ప్రత్యేక స్థానం ఉంది. దీనిలో అనేక రకాలు ఉన్నప్పటికీ, పసుపు రంగు అరటిపండ్లు విరివిగా లభిస్తాయి. అరటి పండ్లలో పోషకాలు అపారంగా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లు, గుండెను పదిలంగా ఉంచే పొటాషియం ఇందులో అధికంగా లభిస్తాయి. అరటి పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఉదాహరణకు, సుమారు 80 గ్రాముల బరువున్న ఒక అరటి పండులో 65 కిలో కేలరీల ఎనర్జీ, 1 గ్రాము ప్రోటీన్, 0.1 శాతం ఫ్యాట్, 16.2 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 1.1 గ్రాముల ఫైబర్, 264 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. మెరుగైన జీర్ణక్రియ: అరటి పండ్లలో అధికంగా ఉండే పెక్టిన్ పేగు పనితీరును మెరుగుపరుస్తుంది. దీనిలోని ఫైబర్ ఆహారం త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది, శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అధిక ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగించి, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. అరటి పండులోని కార్బోహైడ్రేట్లు సులభంగా జీర్ణం కాని ఆహార పదార్థాలు కూడా జీర్ణం కావడానికి తోడ్పడతాయి. ఇది పేగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా వృద్ధికి సహాయపడి, ఫ్యాటీ ఆమ్లాలను ఉత్పత్తి చేస్తుంది. గుండె ఆరోగ్యం ? రక్తపోటు నియంత్రణ: అరటి పండ్లలో పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పుష్కలం. పొటాషియం శరీరంలోని అత్యంత ముఖ్యమైన ఎలెక్ట్రోలైట్లలో ఒకటి. ఇది గుండె పనితీరును మెరుగుపరుస్తుంది, శరీరంలో ఫ్లూయిడ్ల సమతౌల్యాన్ని కాపాడుతుంది, రక్తపోటును నియంత్రిస్తుంది. పొటాషియం రక్తపోటును తగ్గించడమే కాకుండా గుండెపోటు, స్ట్రోక్ రాకుండా అడ్డుకుంటుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఆమ్లత నియంత్రణ: పొట్టలో విడుదలయ్యే ఆమ్లాలను అరటిపండ్లు సమతౌల్యం చేస్తాయి. ఇందులో ఉండే లూకోసియానిడిన్ పేగులోని పలుచని పొరను మందంగా చేయడానికి ఉపయోగపడుతుంది, తద్వారా ఆమ్లాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. బాగా పండిన అరటి పండ్లు గుండెల్లో మంట (ఎసిడిటీ) నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తాయి.

# నరనరాల్లో బలహీనతను నిముషాల్లోనే తరిమికొడుతుంది



ఇవి నరాల ఆరోగ్యానికి ఎంతగానో సహాయపడుతుంది. ఇంకా దీనిలో ఉండే మెగ్నీషియం కండరాలను బలంగా చేస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. మీకు ఎప్పుడైనా అలసటగా అనిపించినప్పుడు దీనిని మీరు స్నాక్‌గా ఎంచక్కా తినొచ్చు.

ఫూల్ ముఖాన నరాల ఆరోగ్యానికి ఎంతగానో సహాయపడుతుంది. ఇంకా దీనిలో ఉండే మెగ్నీషియం కండరాలను బలంగా చేస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. మీకు ఎప్పుడైనా అలసటగా అనిపించినప్పుడు దీనిని మీరు స్నాక్‌గా ఎంచక్కా తినొచ్చు. ఇంకా ఇవి ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇంకా దీనిలో ఉండే ఖనిజాలు కూడా ఎముకల బలాన్నీ పెంచుతాయి. అలాగే, ఇవి జీర్ణక్రియ పనితీరును కూడా మెరుగు పరుస్తాయి. అయితే, మీరు వీటిని సరైన మోతాదులో తీసుకుంటే మంచిది. అలా అని మరి ఎక్కువగా కూడా దీనిని తీసుకోకూడదు. బరువు తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. ఇంకా మీరు జంక్‌ఫుడ్‌కు బదులుగా వీటిని తక్కువ ఆయిల్ తో కాల్చుకుని మఖానా తీసుకోవచ్చు. గుండె ఆరోగ్యానికి కూడా ఇది మంచి ఆహారం. ఇంకా ఎక్కువ ఆయిల్, ఉప్పు లేకుండా దీనిని తీసుకోవడం మంచిది. హై బీపీ సమస్యలు ఉన్నవాళ్లు ఉప్పు ఎక్కువగా వెయ్యకూడదు.

# వంటింటి మసాలా కాదు ఆరోగ్యానికి సహజ ఔషధం!



వంటింట్లో ప్రతిరోజూ ఉపయోగించే అల్లం కేవలం రుచికోసమే కాదు, ఆరోగ్యానికి కూడా అమూల్యమైన సహజ ఔషధం. ఇందులోని జింజరోల్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, జలుబు?దగ్గును తగ్గించడం, కీళ్ల నొప్పులకు ఉపశమనం కలిగించడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి.


అలాగే వికారం తగ్గించడంలో, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణకు తోడ్పడడంలో కూడా అల్లం ఉపయోగకరంగా ఉండవచ్చు. అల్లం ప్రతి వంటగదిలో దాదాపు ప్రతిరోజూ ఉపయోగించే అత్యంత ముఖ్యమైన మసాలా దినుసులలో ఒకటి. ఇది ఆహారానికి ప్రత్యేకమైన రుచి, సువాసనను అందించడమే కాకుండా శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఆయుర్వేదంలో వేల సంవత్సరాలుగా అల్లాన్ని సహజ ఔషధంగా ఉపయోగిస్తున్నారు. ఇందులో ఉండే జింజరోల్ అనే శక్తివంతమైన సమ్మేళనం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలను కలిగి ఉండటంతో శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. అల్లంలోని జింజరోల్, షోగావోల్ వంటి సమ్మేళనాలు జీర్ణరసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. దీంతో ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, కడుపు బరువుగా అనిపించడం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

# ఉదయాన్నే టీ, కాఫీ బదులు ఇది తాగండి..



ఉదయాన్నే టీ, కాఫీ తాగే అలవాటు జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాటికి బదులుగా సబ్జా గింజల పానీయం తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు బరువు తగ్గడం, గట్ ఆరోగ్యం మెరుగుపడటం, శరీర వేడి తగ్గడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం లేవగానే చాలామంది టీ లేదా కాఫీ తాగడానికి అలవాటు పడి ఉంటారు. కొందరు దినచర్యలో భాగంగా దీన్ని అనుసరిస్తే, మరికొందరు మలబద్ధకం నుంచి ఉపశమనం కోసం తాగుతారు. అయితే, ఖాళీ కడుపుతో టీ లేదా కాఫీ తాగడం వల్ల గట్ ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది జీర్ణక్రియ సంబంధిత సమస్యలకు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. ఈ సమస్యలకు పరిష్కారంగా, సబ్జా గింజల పానీయం ఒక ఆరోగ్యకరమైన, ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. సబ్జా గింజలు వాటి అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు తగ్గించడంలో, శరీర వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. గట్ ఆరోగ్యం మెరుగుపడటం వల్ల బీపీ, డయాబెటిస్, పీసీఓడీ, పీసీఓఎస్, క్రమరహిత పీరియడ్స్ వంటి అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. 30 సంవత్సరాలు దాటిన తర్వాత జీర్ణశక్తి క్రమంగా తగ్గుతుంది.. కాబట్టి, గట్ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. సబ్జా గింజలను తీసుకోవడం చాలా సులభం.

# భారత్ ఖాతాలో మరో పతకం....



గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు తమ సత్తా చాటుతున్నారు. తాజాగా వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకాన్ని ఖాతాలో వేసుకుంది. 65 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి రజత పతకాన్ని కైవసం చేసుకుని దేశానికి గర్వకారణంగా నిలిచాడు. ఫైనల్లో రాజా ముత్తుపాండి స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ విభాగాల్లో కలిపి 286 కిలోగ్రాముల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. అతని అద్భుత ప్రదర్శనతో భారత్‌కు మరో విలువైన పతకం లభించింది. ఈ విభాగంలో మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిదిన్ ముహమ్మద్ అసాధారణ ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 299 కిలోగ్రాములు ఎత్తి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా స్వర్ణ పతకాన్ని కూడా సొంతం చేసుకున్నాడు. ఇక పాపువా న్యూ గినియాకు చెందిన మోరేయా బారు కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. చివరి వరకు రాజా ముత్తుపాండితో గట్టి పోటీ ఇచ్చినా, భారత వెయిట్‌లిఫ్టర్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని రజత పతకాన్ని దక్కించుకున్నాడు. ఈ విజయంతో కామన్వెల్త్ గేమ్స్ 2026లో వెయిట్‌లిఫ్టింగ్, పవర్ వెయిట్‌లిఫ్టింగ్ విభాగాల్లో భారత్ మొత్తం నాలుగు పతకాలు సాధించింది.

రాజా ముత్తుపాండి క్రీడా ప్రయాణం సవాళ్లతో నిండింది. 2017లో యూత్ కామన్వెల్త్ గేమ్స్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు గెలిచి తన ప్రతిభను చాటుకున్నాడు. అనంతరం 2019లో లిగమెంట్ గాయం కారణంగా కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌కు దూరమయ్యాడు. గాయానికి శస్త్రచికిత్స చేయించుకోవడంతో చాలా కాలం పోటీలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. 2021లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో మూడో స్థానం సాధించినప్పటికీ, 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించలేకపోయాడు. అయితే రాజా వెనక్కి తగ్గలేదు. కఠిన సాధనతో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు.

# నా కల నిజమైంది.. ఇక మరింత రెచ్చిపోతా..




జింబాబ్వే పర్యటనలో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో మరోసారి అందరి ప్రశంసలు అందుకున్నాడు. భారత్‌కు 35 పరుగుల తేడాతో గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లలో బుడ్డోడు 151 రన్స్ చేశాడు. వైభవ్ అద్భుత బ్యాటింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును కూడా అందుకున్నాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన వైభవ్ సూర్యవంశీ జింబాబ్వే సిరీస్ తనకు ఎంతో ప్రత్యేకమని చెప్పాడు. 'గత మూడు రోజులుగా మా ప్రిపరేషన్ చాలా బాగా జరిగింది. నేను అండర్-19 ప్రపంచ కప్ 2026 హరారేలో ఆడాను. అందుకే ఈ మైదానంలో ఆడటం నాకు చాలా ఇష్టం. కెప్టెన్, కోచ్‌లు, జట్టులోని ప్రతి ఒక్కరూ నాపై పూర్తి నమ్మకం ఉంచారు. వారి మద్దతు వల్లే నేను స్వేచ్ఛగా ఆడగలిగాను. అందుకు చాలా సంతోషంగా ఉంది. ఐపీఎల్‌లో నేను ఎలా ఆడనో, ఇక్కడ కూడా అదే విధంగా ఆడాడనికి ప్రయత్నించాను. ప్రతి మ్యాచ్‌లో జట్టుకు మంచి ఆరంభం ఇవ్వడమే నా లక్ష్యం. ఒకసారి మంచి స్టార్ట్ లభిస్తే దాన్ని పెద్ద ఇన్నింగ్స్‌గా మార్చాలని అనుకున్నాను. అదే నా ఆలోచన' అని వైభవ్ వివరించాడు. తాను మ్యాచ్‌లో ఆడే షాట్లు అన్నీ నెట్స్‌లో సాధన చేసినవేనని వైభవ్ చెప్పాడు. 'ప్రాక్టీస్‌లో ఏ షాట్స్ ఆడుతానో, మ్యాచ్‌లో కూడా అవే షాట్లు ఆడేందుకు ప్రయత్నిస్తాను.

సాధనలో చేసినదాన్ని మ్యాచ్‌లో అమలు చేయడమే నా విధానం. భారత్ తరపున జింబాబ్వేపై పూర్తి సిరీస్ ఆడాను. కెరీర్ ఆరంభంలోనే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందుకోవడంతో నా కల నిజమైంది. రెండు అవార్డులు ఒకేసారి అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. టీమిండియా తరపున

ఆడడం ఎప్పుడూ బాగుంటుంది. ఇకపై కూడా ఇలానే దూకుడుగా ఆడడానికే ప్రయత్నిస్తా' అంటూ బుడ్డోడు తన సంతోషాన్ని అభిమానులతో పంచుకున్నాడు. జింబాబ్వే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన నిలకడను ప్రదర్శించాడు.

తొలి టీ20లో ఫాస్టెస్ట్ అర్ధ శతకం (18 బంతుల్లో 50), రెండో మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ (9బంతుల్లో 20), మూడో మ్యాచ్‌లో మరో తుఫాన్ ఇన్నింగ్స్ (49 బంతుల్లో 81 పరుగులు)తో జట్టుకు బలమైన ఆరంభాలు అందిస్తూ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైభవ్ ఆటపై ప్రశంసల వర్షం కురుస్తోంది. భవిష్యత్ భారత క్రికెట్‌కు మరో స్టార్‌గా వైభవ్ ఎదుగుతున్నాడనే అభిప్రాయాన్ని తన ప్రదర్శనతో మరింత బలపరిచాడు.

# బీసీసీఐపై తెలుగు ప్లేయర్ ఫైర్...!




భారత జట్టు ఎంపిక విధానంపై టీమిండియా మాజీ క్రికెటర్, తెలుగు ఆటగాడు హనుమ విహారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. వరుసగా విఫలమవుతున్నప్పటికీ అభిషేక్ శర్మకు జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో అవకాశాలు ఇవ్వడంపై మండిపడ్డాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో అద్భుతంగా రాణించిన సంజు శాంసన్‌కు మాత్రం ఎందుకు సరైన అవకాశాలు ఇవ్వలేదని ప్రశ్నించాడు. 2-3 మ్యాచ్‌లలో విఫమైన సంజును జట్టు నుంచి తీసేశారని.. అభిషేక్‌ను మాత్రం కొనసాగిస్తున్నారని మండిపడ్డాడు.

హనుమ విహారి తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ 'ప్రపంచ కప్‌కు ముందు సంజు శాంసన్ ఐదు మ్యాచ్‌ల్లో రాణించకపోవడంతో తుది జట్టులో స్థానం కోల్పోయాడు. తిరిగి అవకాశం వచ్చిన తర్వాత ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మ ప్రదర్శనను పరిశీలిస్తే పరిస్థితి భిన్నంగా ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో ఒక అర్ధశతకం మినహా అభిషేక్ బ్యాట్ నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. 20 లేదా 30 పరుగుల ఇన్నింగ్స్ కూడా లేవు. చివరి ఎనిమిది మ్యాచ్‌ల్లో ఒక్క అర్ధశతకం మాత్రమే చేశాడు. ప్రపంచ కప్ మ్యాచ్‌లను కలుపుకుంటే చివరి 18 ఇన్నింగ్స్‌లో కేవలం మూడు అర్ధ శతకాలే ఉన్నాయి' అని వివరించాడు.

# కామన్వెల్త్ గేమ్స్ రజత పతకం వరకు..

## రిషికాంత సింగ్ ప్రయాణం ఇలా.!



కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత వెయిట్‌లిఫ్టర్ "రిషికాంత సింగ్ చానబం" దేశానికి రజత పతకాన్ని అందించాడు. పురుషుల 60 కేజీల విభాగంలో మొత్తం 264 కేజీలు (121 కేజీల స్నాచ్, 143 కేజీల క్లీన్ అండ్ జర్క్) ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. చివరి ప్రయత్నంలో 151 కేజీలు ఎత్తడంలో విజయం సాధించి ఉంటే స్వర్ణ పతకం అతని ఖాతాలో చేరేది. ఈ రజత పతకం వెనుక ఓ క్రీడాకారుడి విజయం మాత్రమే కాదు.. ఎన్నో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు,

జీవితంతో చేసిన పోరాటం దాగి ఉంది. ఒక దశలో వెయిట్‌లిఫ్టింగ్‌కు పూర్తిగా దూరమై, కుటుంబాన్ని ఆదుకోవడానికి నిర్మాణ పనుల్లో రోజువారీ కూలీగా పనిచేసిన రిషికాంత.. ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై భారత్‌కు పతకం అందించాడు. తన జీవితంలో ఎన్నో కష్టమైన రోజులను గుర్తు చేసుకుంటూ రిషికాంత భావోద్వేగానికి గురయ్యాడు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో తన భవిష్యత్తు ముగిసిపోయిందని భావించి, ఈ క్రీడకు చెందిన స్నేహితులతో కూడా సంబంధాలు తెంచుకున్నానని అన్నారు. జీవనోపాధి కోసం ఏ పని దొరికితే ఆ పని చేస్తూ, మరుసటి రోజు ఎక్కడ పని దొరుకుతుందో అనే ఆలోచనతోనే రోజులు గడిపానని తెలిపాడు. రిషికాంత ఇప్పటికే 2016లో జాతీయ యూత్ టైటిల్‌ను గెలుచుకోగా.. 2017 జూనియర్ కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు దారుణంగా ఉండటంతో వెయిట్‌లిఫ్టింగ్‌ను కొనసాగించడం సాధ్యపడలేదు. రోజుకు కేవలం రూ.150 నుంచి రూ.200 మాత్రమే సంపాదించేవాడినని, ఆ డబ్బుతో.. పాలు, గుడ్లు వంటి పోషకాహారం కొనడం కూడా కష్టంగా ఉండేదని తెలిపాడు. కొన్నిసార్లు ఇంట్లో ఏది ఉంటే అదే తినాల్సి వచ్చేదని, మరికొన్ని సందర్భాల్లో అల్పాహారం లేదా రాత్రి భోజనం కూడా మానేయాల్సి వచ్చేదని గుర్తు చేసుకున్నాడు. అయితే అతని జీవితాన్ని పూర్తిగా మార్చేసింది టక్యేల్ లోని వెయిట్‌లిఫ్టింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్. అక్కడ శిక్షణ పొందే అవకాశం రావడంతో మళ్లీ వెయిట్ లిఫ్టింగ్‌పై దృష్టి సారించాడు. కఠోర శ్రమతో ఏడాది వ్యవధిలోనే తన తొలి సీనియర్ జాతీయ టైటిల్‌ను కైవసం చేసుకుని తిరిగి తన సత్తా చాటాడు. అతని కృషికి మరో నిదర్శనంగా 2025లో అహ్మదాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్లో పురుషుల 60 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. అదే ఆత్మవిశ్వాసంతో కామన్వెల్త్ గేమ్స్ లోనూ రజత పతకాన్ని గెలుచుకుని మరోసారి తన ప్రతిభను చాటాడు. స్వర్ణ పతకం చేజారినప్పటికీ తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ రిషికాంత కృతజ్ఞతలు తెలిపాడు. ముఖ్యంగా భారత ప్రధాన కోచ్ విజయ్ శర్మ తనకు పోటీల్లో ఎలా ఆడాలి.? ఎలా శిక్షణ పొందాలి.? అనే విషయంలో ఎంతో మార్గనిర్దేశనం చేశారని కొనియాడాడు. అలాగే భారత క్రీడలకు విశేష ప్రోత్సాహం అందిస్తున్నందుకు ఈ విజయాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

# వరంగల్ విమానాశ్రయానికి రూ.497 కోట్లు



**వరంగల్,** : తెలంగాణలోని వరంగల్ మామ్నూర్ విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మామునూరు ఎయిర్‌పోర్టును రూ. 496.86 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రన్‌వే, అప్రాన్, ట్యాక్సీవే మరియు బౌండరీ వాల్ నిర్మాణం వంటి మౌలిక వసతుల పనుల కోసం ప్రాథమిక టెండర్లను కూడా ఏఏఐ విడుదల చేసింది. మామ్నూర్ విమానాశ్రయ నిర్మాణ పనులు భూసేకరణ, అవసరమైన అనుమతుల ప్రక్రియ పూర్తయిన తర్వాతే వేగవంతం కానున్నాయి. మామునూరు ఎయిర్‌పోర్టు ప్రారంభమయ్యే సమయం పూర్తిగా భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే సమయంపైనే ఆధారపడి ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. వరంగల్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ. 496.86 కోట్ల అంచనాతో అనుమతులు మంజూరు చేసినట్లు కేంద్ర పౌర విమానయానశాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు ఈ సమాధానం ఇచ్చారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తయ్యే సమయం అనేది భూసేకరణ, చట్టబద్ధమైన అనుమతులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఉడాన్ స్కీమ్ కింద తెలంగాణ నుంచి ఇప్పటివరకు 58 విమాన మార్గాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ అధ్యయనాన్ని ఏఏఐ ఇప్పటికే పూర్తి చేసి, అక్కడ అవసరమయ్యే భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై స్పందించారు.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఉమ్మడిగా ఉపయోగించుకోవడానికి ఉన్న అవకాశాలపై ఏఏఐ అధ్యయనం చేసి, అవసరమైన భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు మంత్రి తెలిపారు. పెద్దపల్లిలో ప్రీ-ఫీజిబిలిటీ నివేదికను ఫిబ్రవరిలోనే సమర్పించినట్లు చెప్పారు. అయితే, భద్రాద్రి కొత్తగూడెంలోని రామవరం, చెంచుపల్లి, సుజాతనగర్ పరిధిలోని స్థలాల్లో ఏఏఐ విచారణ జరపగా, అక్కడ ఉన్న కొండలు, రైల్వే లైన్ల కారణంగా విమానాశ్రయం నిర్మాణం సాధ్యం కాదని తేల్చిచెప్పినట్లు వివరించారు. తెలంగాణలో కొత్తగా ఎలాంటి మెట్రో రైలు ప్రాజెక్టులకూ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫస్ట్ ఫేజ్ రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో అమలు చేసిందని, ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద కేంద్ర ఆర్థిక శాఖ రూ. 1,204 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎలాంటి మెట్రో ప్రాజెక్టూ అమల్లో లేదని స్పష్టం చేశారు.

# పశ్చిమలో ఆందోళనలకు వైసీపీ పిలుపు



**హైదరాబాద్,** : ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ధరల సంక్షోభంపై వైయస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతు ప్రతినిధులు, నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలం ప్రారంభమై దాదాపు 94 రోజులు గడిచినా, పండిన 232 మిలియన్ కిలోల పొగాకులో కేవలం 16.5 శాతం మాత్రమే కొనుగోలు చేయడం ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సెప్టెంబరులో కర్ణాటకలో వేలం మొదలైతే ఇక్కడి రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా వచ్చే వారం పది రోజుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గోపాలపురం, జంగారెడ్డిగూడెంలో పర్యటించి ఆందోళనలు చేపడతానని, ప్రభుత్వం స్పందించకపోతే కందుకూరులోనూ పర్యటిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి పొగాకు ధర రూ. 200కు తగ్గకూడదని హెచ్చరించిన మరుసటి రోజే మార్కెట్లో ధరలు దారుణంగా పడిపోయాయని జగన్ ఆరోపించారు. పొదిలి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు, గోపాలపురం తదితర ప్రాంతాల్లో రూ. 130 నుంచి రూ. 186 మధ్యలోనే కొనుగోలు చేయడం వ్యాపారుల సిండికేట్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తోందన్నారు. వ్యాపారులు నో బిడ్లు పెడుతూ, బేళ్లను తిరస్కరిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శించారు. నిబంధనలు పాటించని కంపెనీలపై ఒక్క కేసు నమోదు చేయలేదని, లైసెన్సులను సస్పెండ్ చేయకపోవడం వల్లనే వ్యాపారులకు భయం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. తన హయాంలో రైతుల రక్షణ కోసం అమలు చేసిన విప్లవాత్మక చర్యలను ఈ సందర్భంగా జగన్ గుర్తుచేశారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేశంలోనే తొలిసారిగా మార్క్‌ఫెడ్ ను పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌పైకి తీసుకొచ్చి కొనుగోళ్ళు చేపట్టామని, దీనివల్ల వ్యాపారుల సిండికేట్ విచ్ఛిన్నమై పోటీ పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కాయని పేర్కొన్నారు. అలాగే రూ. 3,000 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేసి, ఐదేళ్లలో పంటల కొనుగోళ్ల కోసం రూ. 7,800 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రతి రైతుభరోసా కేంద్రాన్ని వ్యవసాయ ధరల పర్యవేక్షణ కేంద్రంగా మార్చి, సీఎం యాప్ ద్వారా ప్రతికూల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో తక్షణమే కొనుగోళ్లు జరిపించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను కొనుగోళ్లలోకి రానివ్వకుండా అడ్డుకోవడమే వ్యాపారుల సిండికేట్‌కు కొమ్ముకాయడమేనని జగన్ ఆరోపించారు. నిద్రపోతున్న ప్రభుత్వాన్ని లేపడం సులభం, కానీ నిద్ర నటిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని లేపాలంటే గట్టిగా ఒత్తిడి తీసుకురావాల్సిందే అని వ్యాఖ్యానించారు. రైతుల బాగు కోరే ప్రజా ప్రభుత్వం వచ్చేవరకు తాము విశ్రమించబోమని, పొగాకు రైతులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్‌లో జోక్యం చేసుకుని, హామీ ఇచ్చిన ధరలకు పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ జిల్లాలో ఏ పంట రైతు ఇబ్బంది పడుతున్నా వైయస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని జగన్ భరోసా ఇచ్చారు. ఏదో ఒక ధరకు మా పంట కొని మమ్మల్ని బతికించండి అని రైతులు దేహీ అని వేడుకునే దుస్థితికి ప్రభుత్వాధినేతల నిర్లక్ష్యమే కారణమన్నారు. వ్యాపారులకు లాభాలు చేకూర్చే ధోరణి వీడి, తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులకు న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజా నిరసనల సెగ ప్రభుత్వాన్ని తాకడం ఖాయమని స్పష్టం చేశారు.

# హమ్మయ్య.. వానలు పడ్డాయ్...



అదిలాబాద్, : ఎట్టకేలకు వరుణుడు కాస్త కరుణించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల ముఖాల్లో మళ్లీ చిరునవ్వులు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షం జాడ లేక ఎండిపోతున్న పంటలను చూసి ఆందోళన చెందుతున్న రైతులకు తాజాగా కురిసిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పెద్ద ఊరటనిచ్చింది. ఎన్ లీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ జల్లులు కొత్త ఆశలను నింపాయి. ఈ వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. అడపాదడపా కురిసిన చిరు జల్లులు కూడా సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో పంటలు ఎండిపోతాయనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఒకవైపు పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోగా, మరోవైపు వర్షం కోసం రైతులు కళ్లు కాయలు కాచే పరిస్థితి నెలకొంది. వరుణుడు కరుణించాలని జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కూడా నిర్వహించారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు అందరినీ కదిలించాయి. కొందరు స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తూ పంటలను బతికించేందుకు శ్రమించగా, మరికొందరు ఎడ్లబండ్లపై డ్రమ్ముల్లో నీళ్లు తీసుకొచ్చి మొలకలకు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. వర్షాభావం కారణంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న రైతులకు ఈ వాన కొంత ఊరటనిచ్చిందనే చెప్పాలి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన ముసురు క్రమంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంగా మారింది. ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు మండలం బరంపూర్‌లో అత్యధికంగా 13.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో అత్యల్పంగా 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, భైంసాలో మాత్రం వర్షపాతం నమోదు కాలేదు. ఇప్పటికీ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నా, తాజాగా కురిసిన వర్షం మాత్రం కొంత ఆశను నింపింది. ఇన్ని రోజులుగా వాన కోసం ఎదురు చూసిన రైతులకు ఈ జల్లులు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఎండిపోతున్న పంటలకు తేమ అందడంతో అవి మళ్లీ కోలుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే పంటలు గట్టెక్కుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు ఇలాగే కరుణిస్తే ఈ సీజన్‌లో పంటలను కాపాడుకోవచ్చనే నమ్మకం రైతుల్లో కనిపిస్తోంది.

# కాంగ్రెస్ పార్టీలోనే త్యాగం ఉంది



**మహబూబ్ నగర్,** : దేశం కోసం రక్తం చిందించడం, పదవులను త్యాగం చేయడం గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడిని ఖండించారు. నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ల అమ్మకాలు సాగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో మంగళవారం నాడు కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా పార్టీ నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తన సొంత నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వంలో ఏ ఎగ్జామ్ నిర్వహించినా పేపర్ లీకులు అవుతున్నాయని, దాంతో కోట్లాది విద్యార్థుల జీవితాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్ బీజేపీ నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు పోరాడుతుంటే, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై పాశవిక దాడులు చేశారని మండిపడ్డారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచి, పార్లమెంటులో ధర్నా చేసిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై దాడులు చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. పేపర్ లీకేజీలపై జంతర్ మంతర్ వద్ద ప్రశ్నించిన విద్యార్థుల తలలు పగలగొట్టారని, బాధ్యుడైన ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీపై పోలీసులతో దాడి చేయించారని మండిపడ్డారు. యువత కోసం మోదీని గద్దె దించే వరకు కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. 2019 ఇంటర్ ఫలితాల గోల్‌మాల్‌కు కేటీఆర్ బినామీ సంస్థ 'గ్లోబరీనా'నే కారణమని, అది విద్యార్థుల ప్రాణాలను బలిగొందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆ రోజే దానిపై చర్యలు తీసుకుంటే నీట్, సీబీఎస్ఈ పేపర్ లీకేజీలు జరిగేవి కావన్నారు. ఢిల్లీ బీజేపీ నేతలతో మాట్లాడి కేటీఆర్ ఆ సంస్థకు కాంట్రాక్టులు ఇప్పించారని విమర్శించారు. రాహుల్ గాంధీని అరెస్ట్ చేస్తుంటే రక్తం కూడా వచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. యువత పక్షాన, విద్యార్థులకు అండగా నిలిచేందుకు శాంతియుతంగా నిరసన తెలిపినా కేంద్రం అడ్డుకుంటుందని విమర్శించారు. పేపర్ లీక్ బాధ్యులపై చర్యలు తీసుకోని కేంద్ర ప్రభుత్వం, బాధితులైన విద్యార్థులపై మాత్రం లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. కేంద్రం చేసిన తప్పిదాలను రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారని, ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాడుతోందని దేశం మొత్తం గమనిస్తుందన్నారు. కానీ మోదీ ప్రభుత్వం మాత్రం యువత జీవితాలను గాలికొదిలేసి, కోట్ల రూపాయలు క్యాష్ చేసుకుందని మండిపడ్డారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి, నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నన్ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చేతులు కలిపాయి : రేవంత్ రెడ్డి కొడంగల్: తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ, కేంద్రంలోని బీజేపీ తప్పిదాలను నిలదీస్తున్నందుకే ఆ రెండు పార్టీలు కలిసి తనపై కుట్రలు పన్నుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఆ పార్టీలు సిద్ధాంతపరంగా వేరైనా, కాంగ్రెస్‌ను దెబ్బతీయడమే వారి ప్రధాన లక్ష్యమని.. తన ఓటమి కోసం కలిసి పనిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణపై కొడంగల్‌లో బుధవారం ఉదయం బిఎల్‌ఏలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నామని, కొడంగల్‌లో నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ యత్నిస్తున్నాయని ఆరోపించారు. ఓటు లేని వ్యక్తి చనిపోయిన శవంతో సమానమంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటు విలువ గుర్తించి రాష్ట్ర ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో 78 శాతం ఓటర్ల నమోదు పూర్తయిందని, మిగిలిన 22 శాతం మంది నమోదును బిఎల్‌ఏలు సమగ్ర ఇంటింటి సర్వే (ఎస్ఐఆర్) ద్వారా త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును కాపాడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ నెలాఖరు నాటికి 100 శాతం ఎస్ఐఆర్ పూర్తి చేసి, తనపై కుట్రలు చేసేవారికి తగిన బుద్ధి చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సుప్రీం కోర్టు ముందుకు ఢిల్లీ కేసు

## వీడియోలు చూసే అం టైమ్ లేదన్న సీజేఐ

న్యూఢిల్లీ, : ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసుల లాఠీఛార్జ్‌కు సంబంధించిన పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ వీడియోలు చూసేంత ఓపిక ,తీరిక లేవంటూ తక్షణం విచారణకు అవసరం లేదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. సీజేఐ నిర్ణయంపై సోషల్ మీడియాలో తీవ్రంగా చర్చ జరగుతోంది. ఇదివరకే ఈ పిటిషన్‌పై విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించిందని తెలిసిందే. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలపై కాక్రోచ్ జనతా పార్టీ (అఏఖ) ప్రతినిధి సౌరవ్ దాస్ ప్రశ్నలు లేవనెత్తారు. అయితే, సుప్రీంకోర్టు మెన్షనింగ్ సమయంలో వీడియోలు చూసేందుకు టైమ్ లేదని, పిటిషనర్ తమ సమయాన్ని వృథా చేయవద్దని సీజేఐ చెప్పడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై సౌరవ్ దాస్ పోస్ట్ వైరల్ సుప్రీంకోర్టు విచారణ తర్వాత సౌరవ్ దాస్ చేసిన ఒక పోస్ట్ సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది. ఆ పోస్ట్‌లో ఆయన ఏమన్నారంటే.. 'ఇంత పెద్ద పదవుల్లో ఉన్న ఇలాంటి వ్యక్తులు మన ప్రజాస్వామ్యానికి మచ్చగా మారారు. సుప్రీంకోర్టు విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదు. సీజేఐ సూర్యకాంత్ తీరు సరిలేదని అర్థం చేసుకోవాలి. భారత ప్రభుత్వం ఈ విషయంపై ఆయనకు నచ్చజెప్పాలి' అని పోస్ట్ చేశారు. విద్యార్థుల పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణసుప్రీంకోర్టు ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జరిగిన పోలీసు చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణకు సంబంధించిన పిటిషన్ ను బుధవారం తిరస్కరించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్మాల్యా బాగ్చి, వి. మోహనతో కూడిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ముందుకు పిటిషన్ వచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది గురువారం కేసును త్వరగా విచారించాలని అభ్యర్థించారు. నిరసనల సమయంలో జరిగిన పోలీసు బలప్రయోగం అంశాన్ని లేవనెత్తారు.

వీడియో చూసేందుకు ఆసక్తి లేదన్న సీజేఐ

విచారణ సందర్భంగా, నిరసనల సమయంలో పోలీసులు బలప్రయోగం చేశారనడానికి సంబంధించిన వీడియోలను కోర్టుకు చూపించడానికి లాయర్ ప్రయత్నించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మాట్లాడుతూ, "మాకు వీడియోలు చూసేందుకు ఆసక్తి లేదు. అందుకు సమయం లేదు. విద్యార్థులపై హింస జరిగిందని, వీడియోలు దానికి సాక్ష్యాలని న్యాయవాది మళ్లీ అభ్యర్థించినప్పటికీ, కోర్టు తన వైఖరిని మార్చుకోలేదు. జూలై 20న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి రోజున నిర్వహించిన 'చలో పార్లమెంట్' మార్చ్‌కు సంబంధించిన పిటిషన్ ఇది. వేలాది మంది విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (అఏఖ) బ్యానర్ కింద ఢిల్లీలో గుమిగూడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఔఇఖ-జఉ పరీక్షలో జరిగిన అవకతవకల వల్ల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔం)లో సంస్కరణలు చేపట్టాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

# డిమాండ్లపై తగ్గేది లేదంటున్న రాహుల్...

న్యూఢిల్లీ, : దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల భవిష్యత్తు, ప్రశ్నాపత్రాల లీకేజీల వివాదంపై రాజకీయ రణరంగం తీవ్రస్థాయికి చేరింది. ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసం ఎదుట లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనాయకత్వం , వేలాది మంది విద్యార్థులతో కలిసి రోడ్డుపైనే బైఠాయించి వినూత్న నిరసన చేపట్టారు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, రాహుల్ గాంధీతో చర్చించారు. అయితే ఆ చర్చలు పూర్తిగా విఫలమయ్యాయి. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని, ఈ పోరాటం ప్రతి భారతీయుడి కుటుంబ గౌరవానికి సంబంధించినదని కాంగ్రెస్ పార్టీ తేల్చిచెప్పింది. విద్యార్థులపై జరిగిన దాడి ప్రతి భారతీయ కుటుంబంపై జరిగిన దాడిలాంటిదని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ సమాధానం చెప్పకుండా, ఎటువంటి తీవ్ర పర్యవసానాలను ఎదుర్కొనకుండా తప్పించుకోవచ్చని భావిస్తున్నారు.. కానీ ఈసారి అది ఎంతమాత్రం సాధ్యం కాదు. భారతదేశపు విద్యార్థుల గొంతును ఎవరూ తొక్కిపెట్టలేరు. విద్యార్థులకు న్యాయం జరగాలని కోరుకునే ప్రతీ దేశభక్తుడైన భారతీయుడు ప్రధాని నివాసం ముందు జరుగుతున్న ఈ ధర్నాలో భాగస్వామి కావాలి అని రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. కేంద్రం ముందు ఐదు ప్రధాన డిమాండ్లు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసన విరమించేది లేదని స్పష్టం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ , ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వం ముందు ఐదు కీలక డిమాండ్లను ఉంచాయి మొదటి డిమాండ్: శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాలపై తక్షణమే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలి. రెండవ డిమాండ్: పత్రాల లీకేజీ, పరీక్షల అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి. మూడవ డిమాండ్: నీట్, ఇతర జాతీయ స్థాయి పరీక్షల్లో బాధితులైన అభ్యర్థులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి. నాల్గవ డిమాండ్: లోక్‌సభ , రాజ్యసభల్లో విద్యార్థుల సమస్యలు, పరీక్షల పారదర్శకతపై ప్రధాని సమక్షంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి తక్షణమే చర్చ చేపట్టాలి. ఐదవ డిమాండ్: అక్రమాలకు పాల్పడే నిందితులను శిక్షించడంతో పాటు, భవిష్యత్తులో ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా కఠినమైన జాతీయ స్థాయి చట్టాన్ని రూపొందించాలి. ఢిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్ పరిసర ప్రాంతాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. వర్షాకాల సమావేశాల వేళ ప్రతిపక్ష నేత స్వయంగా ప్రధాని ఇంటి గేట్ల ముందే ధర్నాకు దిగడంతో ఢిల్లీ పోలీసులు, పారామిలట్రీ దళాలు భారీగా మోహరించాయి. పార్లమెంట్, మోదీ నివాసం దగ్గర రాకపోకలను బంద్ చేశారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని, విద్యార్థుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని ప్రకటన చేసినప్పటికీ, విపక్షాలు మాత్రం ప్రధాని నేరుగా వచ్చి సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబడుతున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి విద్యార్థి సంఘాలు ఢిల్లీలోని నిరసనకు మద్దతుగా ర్యాలీలు తీస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో యువజన కాంగ్రెస్, విద్యార్థి సంఘాల నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాస్తారోకోలకు దిగారు. ---

# ట్రైనీ ఐపీఎస్ వేధింపుల కేసు.. షీ టీమ్స్‌కు బదిలీ




**హైదరాబాద్,** : ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన కేసు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుండి షీ టీమ్స్ (మహిళా భద్రతా విభాగం)కు బదిలీ అయింది. సహోద్యోగి అయిన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై ఆయన లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు ఇకపై డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో కొనసాగనుంది. మరోవైపు, ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి నేడు డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆయన రాసినట్లుగా భావిస్తున్న ఒక సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, అందులోని అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, వ్యక్తిగత సంబంధాల్లో తలెత్తిన విభేదాల కారణంగానే ఈ ఫిర్యాదు చేశారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ముస్సోరీలో శిక్షణ సమయంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ కేసులో షీ టీమ్స్ చేపట్టే దర్యాప్తుతో పాటు హైకోర్టులో జరగనున్న విచారణ ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది

# పంజాబ్ పై కమలం గురి

**ఛండీఘడ్,** : పంజాబ్‌లో గతంలో నిరాశాజనకంగా ఉన్న ఫలితాలను పక్కనబెట్టి, బీజేపీ ఇప్పుడు పూర్తి ఆత్మవిశ్వాసంతో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లతో నాలుగో స్థానంలో నిలిచిన పార్టీ, వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నంబర్ వన్‌గా ఎదగాలని సన్నద్ధమవుతోంది. ఇది కేవలం ఆశావాదం కాదు, సంస్థాగతంగా, సామాజికంగా బలపడేందుకు చేస్తున్న క్రమబద్ధమైన ప్రయత్నం.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 4 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 18 శాతం ఓట్లు సాధించింది. ఈ తేడాను గమనించిన బీజేపీ నాయకత్వం, అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 25 శాతం ఓట్లు సాధించగలిగితే అధికారం సాధ్యమని అంచనా వేస్తోంది. వచ్చే ఎన్నికల్లో నాలుగు పార్టీల మధ్య తీవ్ర పోటీ ఉండనుంది కాబట్టి, ఇది బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది.ఆరు నెలల్లో రెండుసార్లు పంజాబ్‌ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యూహానికి కేంద్ర బిందువుగా మారారు. ఫిబ్రవరిలో డేరా సచ్చండ్ సందర్శన చేశారు. ఈ శ్రమాన్ని సందర్శించిన తొలి ప్రధాని మోదీనే. జూలైలో రవిదాస్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించడం. రెండు చర్యలు ఒకే లక్ష్యంతో ఉన్నాయి. రవిదాసీలు, దళితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ప్రభావాన్ని పెంచడం. రవిదాస్ పేరుతో రైలు ప్రారంభం, రవిదాసీ సమాజానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం వ్యూహాత్మకమైనది.పంజాబ్‌లో మాజా, మాల్వా, దువా అనే మూడు ప్రధాన భౌగోళిక ప్రాంతాలున్నాయి. మాజా కాంగ్రెస్‌కు, మాల్వా ఆప్‌కు బలమైన ప్రాంతాలు. దువా ప్రాంతంలోని 24 నియోజకవర్గాల్లో దళితులు ముఖ్యంగా రామగడియాలు, రవిదాసీలు ఎక్కువగా ఉన్నారు. ఈ ప్రాంతంలోనే మోదీ పర్యటనలు కేంద్రీకృతమయ్యాయి. దళిత ఓటర్లను ఆకర్షించడం ద్వారా బీజేపీ తన ఓటు బేస్‌ను విస్తరించాలని చూస్తోంది.జూలై పర్యటనలో ప్రధాని తేజాసింగ్ సముంద్రి వంటి సిక్కు సంస్కర్త గురించి ప్రస్తావించడం కూడా ముఖ్యమైనది. సిక్కు సమాజంలోని ఒక వర్గం ఆయనను మరచిపోయినా, ఆయన నాయకత్వంలో జరిగిన ఉద్యమాలను గుర్తు చేయడం ద్వారా బీజేపీ సిక్కుల్లోనూ మంచి




సంబంధాలు ఏర్పరచుకోవాలని ప్రయత్నిస్తోంది. దళితులు + సిక్కు సంస్కరణవాదులు అనే కలయిక ద్వారా విస్తృతమైన సామాజిక మద్దతు సాధించాలనేది ఉద్దేశం.బీజేపీ కార్యకర్తలు నియోజకవర్గాల వారీగా జనాభా, చారిత్రక నేపథ్యం, సామాజిక సంబంధాలు, బీజేపీకి ఉన్న అడ్డంకులను వివరంగా అధ్యయనం చేస్తున్నారు. జర్నలిస్టులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, మేధావులు, మాజీ రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు, సామాజిక నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇటీవల లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీకి చెందిన అశోక్ కుమార్ మిత్తల్, రాఘవ్ చెద్దా వంటి నాయకులు బీజేపీలో చేరడం ఈ ప్రక్రియకు మరింత బలం చేకూర్చింది. బెంగాల్‌లో అనుసరించిన సంస్థాగత వ్యూహాలను ఇక్కడ కూడా అమలు చేయాలని యోచిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందిపంజాబ్ సరిహద్దు రాష్ట్రం కావడం, మిగిలిన సరిహద్దు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉండడం ఈ ప్రయత్నానికి అదనపు ప్రేరణ. అయితే ఆప్ మాల్వాలో, కాంగ్రెస్ మాజాలో బలంగా ఉన్నాయి. స్థానిక సమస్యలు, ప్రాంతీయ రాజకీయాలు బీజేపీ ముందు సవాళ్లుగా ఉన్నాయి. దళిత ఓటర్లను ఆకర్షించడం ద్వారా ఈ సవాళ్లను అధిగమించాలని బీజేపీ భావిస్తోంది. మొత్తంమీద బీజేపీ ఇప్పుడు చేస్తున్నది కేవలం ఎన్నికల ప్రచారం కాదు. ఇది దీర్ఘకాలిక సంస్థాగత విస్తరణ, సామాజిక సమీకరణ, మరియు వ్యూహాత్మక ఓటర్ టార్గెటింగ్ కలయిక.

# మళ్లీ నామినేటెడ్ లొల్లి

**నల్గొండ,** : తెలంగాణలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా.. కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీ వ్యవహారం మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. గద్దెనెక్కిన కొత్తలోనే పదవులు లభిస్తాయని ఆశపడ్డ క్షేత్రస్థాయి నాయకులకు.. ఈ కాలయాపన మింగుడుపడటం లేదు. తాజాగా మరో 37 కార్పొరేషన్ ఛైర్మన్ల పదవీకాలం ముగియడంతో గాంధీభవన్‌లో రాజకీయం మరింత వేడెక్కింది. పాతవారికి రెన్యువల్ ఇస్తారా లేక కొత్త ముఖాలకు అవకాశం కల్పిస్తారా అన్న ఉత్కంఠతో పాటు.. ఈ జాప్యానికి అసలు బాధ్యులెవరనే కోణంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి.పదవుల భర్తీలో జరుగుతున్న జాప్యానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వైఖరే కారణమని పార్టీలోని ఒక వర్గం గట్టిగా భావిస్తోంది. పార్టీ తరపున ప్రభుత్వంపై సరైన ఒత్తిడి తేవడంలో, నిరంతర ఫాలోఅప్ చేయడంలో నాయకత్వం విఫలమైందన్నది వారి ప్రధాన ఆరోపణ. పదవుల కాలపరిమితి ముగిసి, రెన్యువల్స్‌పై స్పష్టత రావలసిన కీలక సమయంలో అధినేత అందుబాటులో లేకపోవడం వల్లే సమస్య చిక్కుముడిగా మారిందని గాంధీభవ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.అయితే, ఈ విమర్శలను పీసీసీ తీవ్రంగా ఖండిస్తోంది. పదవులు సాధించాక పార్టీని, క్షేత్రస్థాయి శ్రేణులను పట్టించుకోని వారికి మళ్లీ అవకాశం ఇచ్చేది లేదని మహేష్ గౌడ్ స్పష్టం చేయడమే ఈ అసంతృప్తికి అసలు కారణమని పీసీసీ వర్గాలు అంటున్నాయి. నామినేటెడ్ పదవి లభించిన తర్వాత కూడా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే రెన్యువల్స్ ఉంటాయని, పనిచేయని వారికి చెక్ పెట్టాలనే సీరియస్ నిర్ణయం వల్లే కొందరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేస్తున్నాయి.ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ ఒకే మాటపై ఉన్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవుల భర్తీలో పూర్తిస్థాయి పారదర్శకత, పనితీరు ఆధారంగానే ఎంపిక ఉండాలని భావిస్తున్నారు. అందుకోసం ఒక



నయా ఫార్ములాను అమలు చేయాలని యోచిస్తున్నారు. సుదీర్ఘకాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కొత్త నాయకులతో ముందుగా ఖాళీగా ఉన్న కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను భర్తీ చేయాలనుకుంటున్నారు. కొత్తవారి ఎంపిక పూర్తయిన రెండు నెలల తర్వాత మాత్రమే పాతవారి రెన్యువల్స్‌పై చర్చించనున్నారు. ఇలా చేయడం వల్ల ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులకు తక్షణ ఊరట లభిస్తుందని పార్టీ యోచిస్తోంది.ప్రస్తుతం తలెత్తిన చిక్కుముడిని విప్పేందుకు అధిష్ఠానం రంగంలోకి దిగుతోంది. ఈ వారంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌లు ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ కీలక సమావేశంలోనే నామినేటెడ్ పోస్టుల జాబితాపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి రోజుల్లోనే నామినేటెడ్ పదవులను పూర్తిస్థాయిలో భర్తీ చేసి ఉంటే ఇప్పుడు ఈ గందరగోళం ఉండేది కాదనేది మెజారిటీ నాయకుల అభిప్రాయం. జరిగిందేదో జరిగిపోయినా.. ఇప్పటికైనా అధిష్ఠానం చొరవ తీసుకుని, నిజమైన కార్యకర్తలను గుర్తించి త్వరితగతిన పోస్టులను నింపాలని కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నాయి

# బీజేపీ నేతలకు గ్రేటర్ ఎన్నికలే మొదటి టాస్క్




**హైదరాబాద్,** : గ్రేటర్ లో జరగాల్సిన మూడు కార్పొరేషన్ల ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ తన పొలిటికల్ ఫోకస్‌ను తీవ్రం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు ప్రధాన కార్పొరేషన్లతో పాటు, నార్త్ తెలంగాణకు గుండెకాయ లాంటి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని బీజేపీ అధిష్ఠానం పక్కా వ్యూహాన్ని రచిస్తోంది. ఇప్పటికే నితిన్ నవీన్ మూడు రోజుల పాటు పర్యటించి.. . గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలోని బూత్ ప్రెసిడెంట్లతో, రాష్ట్ర కార్యవర్గంతో జరిపిన కీలక భేటీలలో దీనికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైంది. ఇక్కడి సమస్యలను గుర్తించి నేతల మధ్య సయోధ్య ప్రయత్నాలు కూడా పూర్తి చేశారు.ఈ మెగా ఎన్నికల సమరానికి సంబంధించి వ్యూహాల అమలు, నిధులు, వనరుల సమీకరణ పై బీజేపీ అగ్రనాయకత్వం ఒక స్పష్టమైన బ్లూప్రింట్‌ను ఖరారు చేసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, వరంగల్ అర్బన్ బెల్ట్‌లో పార్టీకి వచ్చిన భారీ ఓటింగ్ శాతాన్ని క్షేత్రస్థాయిలో సీట్లుగా మార్చుకోవడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. జీహెచ్‌ఎంసీ పరిధిలో కేవలం సోషల్ మీడియా ప్రచారాలకే పరిమితం కాకుండా, ప్రతి డివిజన్‌లోనూ బలమైన ఆర్థిక, అంగబలం ఉన్న అభ్యర్థులను ఇప్పుడే గుర్తించి వారికి రూట్ మ్యాప్ ఇవ్వాలని, ఎన్నికల ఖర్చులకు వెనకాడకుండా వనరులను ముందే సర్దాలని ఈ కీలక భేటీలో నిర్ణయించారు.బీజేపీ లీడర్‌షిప్ ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ కార్పొరేషన్ల పరిధిలో నిశ్శబ్దంగా అంతర్గత సర్వేలు చేయించింది. సిట్టింగ్ కార్పొరేటర్ల పనితీరు, అధికార కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న యాంటీ-ఇంకంబెన్సీ , బీఆర్ఎస్ కేడర్ బలాబలాలపై స్పష్టమైన రిపోర్ట్ సిద్ధం చేసుకుంది. ఈ సర్వే నివేదికల ఆధారంగానే వరంగల్ కార్పొరేషన్‌లో ఈసారి క్లీన్ స్వీప్ చేయాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. వరంగల్‌లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ క్రమంగా పడిపోతుండటం, కాంగ్రెస్ అంతర్గత విభేదాలు తమకు కలిసివస్తాయని కమలనాథులు అంచనా వేస్తున్నారు. ఇటు హైదరాబాద్ పరిధిలోని సైబరాబాద్, మల్కాజ్‌గిరి ఐటీ, అర్బన్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రచారాస్త్రాలుగా మార్చుకోనున్నారు.ప్రస్తుతానికి అధికార కాంగ్రెస్ పార్టీ నగరాల్లో పట్టు కోసం చూస్తుండగా, పాత బస్తీకి పరిమితమైన ఎంఐఎం తో దోస్తీ కట్టి లబ్ధి పొందాలని చూస్తోందని.. దీనిని హిందూ ఓటర్లలో సెంటిమెంట్‌గా మార్చాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. రాబోయే రెండు, మూడు నెలల్లోనే ఈ గ్రేటర్ ఎన్నికల నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున.. అభ్యర్థుల ఎంపిక నుండి పోలింగ్ బూత్ మేనేజ్‌మెంట్ వరకు అంతా ముందే సెట్ చేసుకోవాలనే కమల వ్యూహం, తెలంగాణ కార్పొరేషన్ల పీఠాలపై ఏ మేరకు జెండా పాతేలా చేస్తుందో చూడాలి.

# జెన్ జీ జపంలో గులాబీ



**హైదరాబాద్,** : తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేస్తోంది. ఇప్పటిదాకా గ్రామీణ ఓటర్లు, రైతాంగ సమస్యలు, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్ల చుట్టూనే తమ రాజకీయ వ్యూహాలను తిప్పిన ఃఖీూ, ఇప్పుడు రూట్ మార్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో యువత, నిరుద్యోగులే లక్ష్యంగా ఒక పక్కా పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. తాజాగా హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు' బీఆర్ఎస్ రాబోయే రాజకీయ కార్యాచరణకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ఊహించని స్థాయిలో తరలివచ్చిన యువత, ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ అమలుపై వ్యక్తం చేసిన నిరసన ప్రభుత్వంపై ఎంతటి అసంతృప్తి ఉందో స్పష్టం చేసింది. ఈ జనాగ్రహాన్ని క్యాచ్ చేస్తూ, నిరుద్యోగ సమస్యననే రాబోయే రోజుల్లో తమ ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవాలని బీఆర్ఎస్ డిసైడ్ అయింది.ఈ వ్యూహంలో అత్యంత ఆసక్తికరమైన అంశం? జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను స్థానిక రాజకీయాలకు కేటీఆర్ జోడించిన తీరు! ఇటీవల నేపాల్‌లో యువత చేపట్టిన 'జెన్ జీ మూవ్‌మెంట్' సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఇదే పాయింట్‌ను కేటీఆర్ తన డిజిటల్ వ్యూహంలో భాగం చేసుకున్నారు. పది నెలల క్రితం తాను చేసిన ఒక ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ "ప్రభుత్వాలు జెన్ జీ, యువత ఆకాంక్షలను నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ప్రపంచ పరిణామాలే నిదర్శనం" అని పేర్కొన్నారు. నిరుద్యోగ తిరుగుబాటును తాను ముందే ఊహించాననే చర్చకు ఇది గట్టి పునాది వేసింది.బీఆర్ఎస్ కొత్త స్ట్రాటజీ వెనుక కొన్ని ముఖ్యమైన అంశాలున్నాయి. కేవలం పల్లెలు, రైతులకే పరిమితం కాకుండా పట్టణాల్లోని గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు, ఉద్యోగార్థులను తమ వైపు తిప్పుకునే స్కెచ్ ఉంది. గ్రూప్ ఎగ్జామ్స్ రద్దు, నోటిఫికేషన్ల లీకేజీలు, నియామకాల జాప్యం వంటి అంశాలపై నిరుద్యోగుల్లో ఉన్న ఆక్రోశానికి నాయకత్వం వహించడం ద్వారా వాళ్లకు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నారు. సోషల్ మీడియాలో నిమిషాల్లో ట్రెండ్స్ మార్చే తాజా తరం మద్దతు కూడగట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పెను మార్పులు తీసుకురావాలనేది దీని వెనుక ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా కేంద్రంలో నిరుద్యోగ నిరసనలు, యువజన సదస్సులు నిర్వహించేందుకు బీఆర్ఎస్ బ్లూప్రింట్ సిద్ధం చేస్తోంది. గతంలో సాధించిన రైతాంగ పోరాట అనుభవానికి, ఇప్పుడు యువత ఉద్రేకాలను జతచేసి భవిష్యత్తులో ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి పెంచడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యం. అయితే, కేవలం అధికార పక్షాన్ని విమర్శించడమే కాకుండా, తాము మళ్లీ వస్తే యువత సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపుతామో నమ్మించడమే బీఆర్ఎస్ ముందున్న అసలైన సవాలు. మరి కేటీఆర్ ప్రయోగించిన ఈ జెన్ జీ కార్డ్ ఏ స్థాయిలో వర్కవుట్ అవుతుందో, గులాబీ దళానికి పూర్వవైభవం తెచ్చిపెడుతుందో లేదో వేచి చూడాల్సిందే!

# తెలంగాణకు భారీగా రియల్ ఆదాయం

**హైదరాబాద్,** : భారతదేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్లలో హైదరాబాద్ తన అగ్రస్థానాన్ని మరోసారి నిలబెట్టుకుంది. 2026 ఏడాది మొదటి అర్ధభాగంలో నగరంలో ఇళు ,, ప్లాట్ల కొనుగోళ్లు ఊహించని రీతిలో పుంజుకున్నాయి. తాజా గణాంకాల ప్రకారం.. ఈ ఆరు నెలల కాలంలో హైదరాబాద్ వ్యాప్తంగా మొత్తం 37,992 ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 36,213 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధిని సూచిస్తోంది. ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల కల్పన వంటి సానుకూల అంశాలు నగర రియాల్టీకి మరింత బూస్ట్ ఇచ్చాయి.ఈ రిజిస్ట్రేషన్ల జోరుతో తెలంగాణ రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. గత ఆరు నెలల్లో రియల్ ఎస్టేట్ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఏకంగా 4,118 కోట్ల ఆదాయం లభించింది. గత ఏడాది వసూలైన రాబడితో పోలిస్తే ఇది ఏకంగా 52 శాతం అద్భుతమైన వృద్ధిని నమోదు చేయడం విశేషం. జూన్ నెలలో ప్రభుత్వం భూముల ప్రభుత్వ విలువల సవరణ చేపట్టబోతుందనే ముందస్తు అంచనాలతో, మే నెలలోనే అత్యధిక సంఖ్యలో కొనుగోలుదారులు తమ రిజిస్ట్రేషన్లను ముగించుకోవడం కూడా ఈ ఆదాయ విప్లవానికి ఒక ప్రధాన కారణమైంది.నెలవారీ విశ్లేషణను పరిశీలిస్తే.. మే 2026 నెల మార్కెట్ చరిత్రలోనే అత్యంత కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఈ ఒక్క నెలలోనే ఏకంగా 8,344 రిజిస్ట్రేషన్లు జరిగాయి, ఇది గత ఏడాదితో పోలిస్తే 33 శాతం కంటే ఎక్కువ వృద్ధి. అయితే, మే నెలలో ముందస్తుగా రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరగడం , జూన్ 5 నుండి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలులోకి రావడంతో.. జూన్ నెలలో మార్కెట్ స్వల్పంగా నెమ్మదించింది. గత ఏడాది జూన్‌లో 6,391 రిజిస్ట్రేషన్లు జరగ్గా, ఈ ఏడాది జూన్ నాటికి అది స్వల్పంగా తగ్గి 5,560 కి చేరింది.ఈ నివేదికలో గమనించాల్సిన మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు ప్రీమియం హౌసింగ్ వైపు వేగంగా మళ్లుతోంది. మొత్తం మార్కెట్ వాటాలో ఈ కేటగిరీ ఇళ్లే ఏకంగా 26 శాతం వాటాను కైవసం చేసుకున్నాయి. మరోవైపు, ఒకప్పుడు మార్కెట్‌ను శాసించిన ?25 లక్షల లోపు ఉండే బడ్జెట్ ఇళ్లు , ప్లాట్ల కొనుగోళ్లు క్రమంగా క్షీణించడం.. హైదరాబాద్ కొనుగోలుదారుల మారుతున్న ప్రాధాన్యతలను , పెరిగిన కొనుగోలు శక్తిని స్పష్టం చేస్తోంది.

# విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్

**నిజామాబాద్,** : తెలంగాణలో విద్యా వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు, నకిలీ హాజరు విధానానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్టూడెంట్-టీచర్స్ (ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు) పరీక్ష ఫీజు చెల్లించాలన్నా, లేదా వార్షిక పరీక్షలకు హాజరు కావాలన్నా బయోమెట్రిక్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు డేటా అత్యంత కీలకం కానుంది. ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదయ్యే హాజరును పరీక్షల అర్హత ప్రక్రియతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది.నూతనంగా ప్రవేశపెట్టిన ఈ డిజిటల్ హాజరు అనుసంధాన ప్రక్రియ 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు కానుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ నిర్వహణలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలు ప్రైవేట్ మేనేజ్‌మెంట్ కళాశాలలకు ఇది వర్తిస్తుంది.డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్ ద్వారా సేకరించే డేటాను విద్యార్థుల పరీక్షల అర్హతను నిర్ణయించేందుకు ప్రామాణికంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, తగిన హాజరు శాతం లేని విద్యార్థి ఉపాధ్యాయులు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కోల్పోతారు.సాధారణంగా గతంలో విద్యాసంస్థలు మాన్యువల్‌గా పంపే అటెండెన్స్ రిజిస్టర్ల ఆధారంగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేవారు. దీనివల్ల కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులు క్లాసులకు రాకపోయినా హాజరు ఉన్నట్లు చూపించే అక్రమాలు జరిగే అవకాశం ఉండేది.కానీ ఈ కొత్త విధానం ప్రకారం, ప్రతిరోజూ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా విద్యార్థి ముఖాన్ని స్కాన్ చేసి



హాజరును ఆన్‌లైన్ సర్వర్‌లో నమోదు చేస్తారు. పరీక్షల నోటిఫికేషన్ విడుదలైనప్పుడు, విద్యార్థి నిర్దేశిత శాతం (ఉదాహరణకు 75 శాతం లేదా 80 శాతం) హాజరును కలిగి ఉంటేనే పరీక్షల పోర్టల్‌లో సదరు విద్యార్థి ఐడీ ఓపెన్ అవుతుంది. అప్పుడే పరీక్ష ఫీజు చెల్లింపునకు, హాల్ టికెట్ జనరేషన్‌కు సిస్టమ్ అనుమతిస్తుంది. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థులను సాఫ్ట్‌వేర్ ఆటోమేటిక్‌గా రిజెక్ట్ చేస్తుంది.ఈ సమగ్ర డిజిటల్ అనుసంధాన వ్యవస్థ ద్వారా విద్యాశాఖ పలు కీలక ప్రయోజనాలను ఆశిస్తోంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకత వస్తుంది. అర్హులైన, క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యే నిజమైన విద్యార్థులు మాత్రమే పరీక్షలు రాసేలా ఈ విధానం నిర్ధారిస్తుంది.మాన్యువల్ డేటా ఎంట్రీ, హాజరు లెక్కింపుల వల్ల జరిగే కాలయాపన తప్పుతుంది. డిజిటల్ డేటా నేరుగా పరీక్షల విభాగానికి లింక్ అవ్వడం వల్ల సమయం ఆదా అవుతుంది. కాబోయే ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరవడం ద్వారా ప్రాథమిక విద్యా బోధనలో అత్యుత్తమ నైపుణ్యాలను అలవర్చుకునే అవకాశం కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యా రంగంలో జవాబుదారీతనాన్ని మరింత పెంచుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వచ్చేసిన డెంగీ టీకా

**ముంబై,** : ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారిన డెంగీ మహమ్మారి నివారణకు భారత్ లో సరికొత్త ఆయుధం అందుబాటు లోకి వచ్చింది. దేశంలోనే మొట్టమొదటి డెంగీ నివారణ వ్యాక్సిన్ 'క్యుడెంగా' విడుదలకు భారత ఔషధ నియంత్రణ సంస్థ అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. ఈ వ్యాక్సిన్‌ను జపాన్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ 'తకేడా' అభివృద్ధి చేసింది. డెంగీ నివారణ కోసం మన దేశంలో డీసీజీఐ ఆమోదం పొందిన తొలి టీకా ఇదే కావడం గమనార్హం.తకేడా బయో ఫార్మాస్యూటికల్స్ ఇండియా అందించిన వివరాల ప్రకారం, 4 సంవత్సరాల వయస్సు నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు ఉన్నవారందరూ ఈ 'క్యుడెంగా' వ్యాక్సిన్ తీసుకోవడానికి అర్హులు. ముఖ్యంగా, గతంలో డెంగీ బారిన పడిన వారైనా లేదా అసలు డెంగీ సోకని వారైనా సరే.. ఎవరైనా ఈ టీకాను నిర్భయంగా తీసుకోవచ్చు. సాధారణంగా కొన్ని రకాల వ్యాక్సిన్లు ఇచ్చే ముందు రక్తం లేదా ఇతర పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కానీ, ఈ క్యుడెంగా టీకా తీసుకోవడానికి ఎటువంటి ముందస్తు పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదు.మూడు నెలల కాల వ్యవధిలో 0.5 మి.లీ. చొప్పున రెండు మోతాదుల్లో (2 డోసులు) ఈ వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుందని వైద్య నిపుణులు వెల్లడించారు. డెంగీ వైరస్‌లో ఉన్న నాలుగు రకాల వేరియంట్లు (సెరోటైప్స్) పై ఈ వ్యాక్సిన్ అత్యంత సమర్థవంతంగా పనిచేసి, దీర్ఘకాలిక రక్షణ కల్పిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న డెంగీ కేసుల్లో దాదాపు మూడో వంతు భారత్‌లోనే ఉంటున్న నేపథ్యంలో, ఈ టీకా రాకతో డెంగీ కారణంగా ఆసుపత్రి పాలయ్యే వారి సంఖ్య భారీగా తగ్గుతుందని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే 40కి పైగా దేశాల్లో ఆమోదం పొందిన ఈ క్యుడెంగా వ్యాక్సిన్, ఇప్పుడు భారత మార్కెట్లోకి రావడం ప్రజారోగ్య రక్షణలో ఒక మైలురాయిగా నిలవనుంది.

# సెకండ్ ఇన్నింగ్స్ అదుర్స్



తెలుగు ప్రేక్షకులకు సాయికుమార్ అనే పేరు పరిచయం అవసరం లేదు. ఆయన పేరు వినగానే ముం దుగా గుర్తుకు వచ్చేది గంభీరమైన గాత్రం, స్పష్టమైన ఉచ్చారణ, శక్తివంతమైన డైలాగ్ డెలివరీ. అందుకే తెలుగు చిత్రసీమ ఆయనను ప్రేమగా 'డైలాగ్ కింగ్' అని పిలుస్తుంది. ఇటీవలే సినీ పరిశ్రమలో 50 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసి అరుదైన మైలురాయిని అందుకున్న సాయి కుమార్ పుట్టినరోజు నేడు.

తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ తన నటనా ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగించిన ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అదే జోరును కొనసాగిస్తున్నారు. రవితేజ 'ఇరుముడి', 'ధర్మస్థల నియోజక వర్గం', 'సంబరాల ఏటిగట్టు', నాగార్జున 100వ చిత్రం, 'వేదవ్యాస్', కిరణ్ అబ్బవరం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం, 'ఏమో ఏమో ఇది', విశ్వక్ సేన్ చిత్రం, 'లుంగీ మ్యాన్', నితిన్–నాని ప్రాజెక్ట్, 'ఫుల్ బాటిల్', 'బరి', 'కూర్మావతారం', 'సాయి బాబా' వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే 'వచ్చినవాడు గౌతమ్', 'ఎస్‌ఐ యుగంధర్'లో కామియోగా కనిపించనున్నారు. 'మూడు లాంతర్లు', 'కన్యాశుల్కం' వెబ్ సిరీస్‌లోనూ నటిస్తున్నారు. కన్నడలో 'బైల్', 'సత్య: సన్ ఆఫ్ హరిశ్చంద్ర', 'బిల్లా రంగా భాషా' చిత్రాల్లోనూ కీలక పాత్రలు చేస్తున్నారు.

# చాలా కష్టపడి ఆ సినిమాను పూర్తి చేశాను



క్రియేటివ్ దర్శకుడు కృష్ణవంశీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కమర్షియల్ ఫార్ములాకు దూరంగా ఉ ంటూ, వైవిధ్యమైన కథాంశాలతో ఎన్నో విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన ఆయన, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. తాజా ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న అత్యంత కఠిన అనుభవాన్ని కృష్ణవంశీ పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు నేను ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించాను. వాటిలో కొన్ని విజయాలు సాధించాయి, మరికొన్ని ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి.

అయితే 'మొగుడు' సినిమా విషయంలో మాత్రం నేను తీవ్రంగా ఇబ్బందులు పడ్డాను. ఆ చిత్రాన్ని ఎంతో ఉత్సాహంగా ప్రారంభించాను. కానీ ఆ తర్వాత కొంతమంది నన్ను మోసం చేశారు. దాంతో ఆ సినిమా చేయాలనే ఆసక్తి కూడా పూర్తిగా పోయింది. ఎంతో బాధతో ఆ చిత్రాన్ని పూర్తి చేశాను. షూటింగ్ జరిగిన కొన్ని నెలల పాటు 'ఈ సినిమా ఎప్పుడు పూర్తవుతుంది? దీని నుంచి ఎప్పుడు బయటపడతానా?' అనే వేదనతోనే గడిపానని తెలిపారు. ఇక 'మొగుడు' చిత్రంలో గోపీచంద్ హీరోగా, తాప్సి హీరోయిన్‌గా నటించారు. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేక ఫ్లాప్‌గా నిలిచింది.

# 'ఇరుముడి' సెకండ్ సింగిల్ రిలీజ్ డేట్ ఫిక్స్...



మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం 'ఇరుముడి' చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 21న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి తొలి పాటను విడుదల చేసిన మేకర్స్, ఇప్పుడు రెండో పాట విడుదలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా రెండో సింగిల్‌ను జూలై 29న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలోనే వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఈ చిత్రంలో ప్రియ భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్రలో కనిపించనుంది. సాయికుమార్ ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.

# మోహన్ బాబు అలాంటి వ్యక్తి...




**సెట్లో అలా చేసేవారు**

'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా నటించిన ఈ చిత్రంలో రషా తడాని కథానాయికగా నటించగా, మోహన్ బాబు కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఓ ఈవెంట్‌లో దర్శకుడు అజయ్ భూపతి మోహన్ బాబు గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ.. సీనియర్ లెజెండరీ నటుడు మోహన్ బాబు గారు మా సినిమాలో కీలక పాత్రలో నటించారు.

ఆయన గొప్ప నటుడు. ఆయనకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. అలాగే ఎన్నో విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అంతటి గొప్ప వ్యక్తి అయినప్పటికీ సెట్స్‌లో మాత్రం ఎంతో సింపుల్‌గా ఉండేవారు. దర్శకుడు ఏం చెబితే అది ఎలాంటి అభ్యంతరం లేకుండా చేసేవారు. ఆయన వల్ల ఒక్కరోజు కూడా మా షూటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. 'ఎన్ని రోజులు షూటింగ్‌కు రావాలన్నా వస్తాను.. ఎలా చేయమంటే అలా చేస్తానని అన్నారు. ఈ సినిమా విషయంలో ఎవరికైనా 'ఐ లవ్ యూ' చెప్పాలంటే ఇద్దరికే చెబుతాను. ఒకరు మా హీరో జయకృష్ణ ఘట్టమనేని, మరొకరు మోహన్ బాబు గారు. అంతలా ఆయన నాకు అండగా నిలిచారని అజయ్ భూపతి అన్నారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# జాతీయ అవార్డు వివాదంపై ధనుష్ స్పందన




కోలీవుడ్ క్రేజీ హీరోల్లో ఒకరైన ధనుష్ కొంతకాలం క్రితం 'రాయన్' చిత్రంలో హీరోగా నటించడమే కాకుండా, ఆ చిత్రానికి స్వీయ దర్శకత్వం కూడా వహించారు. ఇటీవల ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ఈ సినిమాకు ఉత్తమ తమిళ చిత్రం విభాగంలో అవార్డు దక్కింది. అయితే ఈ అవార్డుపై కోలీవుడ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలామంది 'రాయన్' సాధారణ చిత్రమేనని, అదే ఏడాది విడుదలైన 'మేయళగన్', 'మహారాజా' వంటి చిత్రాలు దీనికంటే మెరుగైనవని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ధనుష్ జాతీయ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ... 'మేయళగన్', 'మహారాజా' సినిమాలు 'రాయన్' కంటే మెరుగైనవే. కానీ నా 'పుదుపెట్టై', 'వడ చెన్నై', 'కర్ణన్', 'మారియన్', 'రాంఝునా' వంటి చిత్రాలకు జాతీయ అవార్డులు రానప్పుడు కనీసం 10 శాతం మంది కూడా మాట్లాడలేదు. ఇప్పుడు మాత్రం నా అవార్డును 90 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు అని అన్నారు. ప్రస్తుతం ధనుష్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# సర్ప్రైజ్ చేసే యూనిక్ థ్రిల్లర్



సుమంత్ హీరోగా ఈవిన్ నిర్మాణంలో తెరకెక్కిన 'సినిమా 'న్యూటన్స్ థర్డ్ లా. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కె.హరీశ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన హీరో అడివి శేష్ మాట్లాడుతూ,' ట్రైలర్ చాలా నచ్చింది. డైరెక్టర్ రాజేష్ ఇలాంటి సినిమా తీసుకురావడం చాలా హ్యాపీగా ఉంది. ట్రైలర్‌లో చాలా మంచి ఎనర్జీ ఉంది. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ లా అనిపిస్తోంది. సుమంత్ నా ఫేవరెట్ బ్రో. నా ఫస్ట్ సినిమా నుంచి చాలా సపోర్ట్‌గా ఉ న్నాడు. జగపతి బాబు చాలా స్టైలిష్‌గా అనిపించారు అని తెలిపారు. "'మళ్లీ రావా' సినిమా తర్వాత సింగిల్ సిట్టింగ్ లో ఓకే చేసిన కథ ఇది. ఈ సినిమాలో హీరో స్క్రీన్‌ప్లే. ఇందులో ప్రతి క్యారెక్టర్‌కు ప్రాధాన్యత ఉంది. ప్రతి పాత్రకు కథను మలుపు తిప్పే అవకాశం ఉంటుంది. మంచి థ్రిల్ ఉన్నా, వాటి సెంట్రల్ డ్రామా ఫ్యామిలీ చుట్టూనే ఉంటుంది. ఇది ఈటీవీ విన్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకుంటుంది. రాజేష్ స్టైల్, కథ, స్క్రీన్‌ప్లే నాకు చాలా నచ్చాయి. ఈ ట్రైలర్‌లో మేము చాలా తక్కువ కథనే చెబు తున్నాం. ఈనెల 31న మీరు థియేటర్లకు వస్తే చాలా పెద్ద సర్‌ప్రైజ్ ఉంటుందిఅని హీరో సుమంత్ చెప్పారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ, 'ఈటీవీ విన్ ప్రయాణంలో ఎన్నో వైవిధ్యమైన కథలు చేశాం. అన్నింటిలో మీరు మాకు తోడుగా ఉన్నారు. అలాంటి మరో వైవిధ్యమైన చిత్రం ఇది. రాజేష్ చాలా కొత్తరకం సినిమా చేశాడు. తను కచ్చితంగా చాలా మంచి దర్శకుడు అవుతాడు. మరోమారు మంచి సినిమాతో రాబోతున్నందుకు ఆనందంగా ఉంది అని చెప్పారు.

# ఎలాంటి డ్రీమ్ రోల్స్ లేవు.. భాగ్యశ్రీ బోర్సే



టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటిఫుల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ, తన అందం, నటనతో కుర్రకారు గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకోవడంతో పాటుగా స్టార్ హీరోల సరసన నటించి ప్రేక్షకులను మెప్పించారు. ఇక ఇటీవల అక్కినేని అఖిల్ సరసన 'లెనిన్' చిత్రంలో నటించి సూపర్ హిట్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఆమె క్రేజ్ మరింత పెరిగిపోయింది. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో ఆమెకు వరుస అవకాశాలు తలుపు తడుతున్నాయి. ఇందులో భాగంగా కోలీవుడ్ స్టార్ శివకార్తికేయన్ సరసన 'సెయాన్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, భవిష్యత్తు ప్రణాళికల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కెరీర్ పరంగా తాను ఎలాంటి పెద్ద పెద్ద కలలు లేదా టార్గెట్లు పెట్టుకోలేదని ఆమె వెల్లడించారు. తనకు డ్రీమ్ రోల్స్ అంటూ ఏమీ లేవని, జీవితంలో వచ్చే అవకాశాలను బట్టి ఫ్లోలో ముందుకు వెళ్లడమే తన విధానమని చెప్పారు. పెద్ద పెద్ద టార్గెట్లు పెట్టుకుంటే అనవసరమైన ఒత్తిడి, టెన్షన్ వస్తాయని, అందుకే చిన్న చిన్న టైమ్ లైన్స్ పెట్టుకుని ముందుకెళ్తే మనసుకు చాలా ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా, తనకు ఎన్ని ఇండస్ట్రీల నుంచి అవకాశాలు వచ్చినప్పటికీ, తెలుగు చిత్రసీమలోనే సెటిల్ అవ్వాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చివరికి తన కెరీర్‌లో చేసే ఆఖరి సినిమా కూడా తెలుగులోనే చేస్తానని చెప్పడం విశేషం. టాలీవుడ్‌లో దిగ్గజ దర్శకులు రాజమౌళి, సుకుమార్ దర్శకత్వంలో పనిచేయడమే తన కోరికని పేర్కొన్నారు. ఇండస్ట్రీలో మిగతా హీరోయిన్లు వరుస టార్గెట్లతో పరుగులు తీస్తుంటే, భాగ్యశ్రీ మాత్రం ఎలాంటి ఒత్తిడి లేకుండా తనదైన శైలిలో ముందుకు సాగుతుండటం విశేషం.

# ఓటీటీ స్ట్రీమింగ్‌కు రెడీ అయిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'...

వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ఈచిత్రం జూన్ 5, 2026న భారీ అంచనాల నడుమ విడు దలైనప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ మూవీ డిజిటల్ హక్కులను 'జీ5' సంస్థ సొంతం చేసుకోగా, జూలై 31 నుంచి హిందీ భాషలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన ఈ చిత్రం, ఓటీటీలో ఎలాంటి ఆదరణ పొందుతుందో చూడాలి. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని టిప్స్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రమేష్ తౌరానీ నిర్మించారు.




Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com